



Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 265 | శనివారం 04 ఏప్రిల్ 2026 | పేజీలు : 8 వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


# పోరు ఉధృతం

- కువైట్ చమురు రిఫైనరీలో మంటలు
- అమెరికా ఎఫ్-35ని కూల్చేశాం : ఇరాన్
- తదుపరి లక్ష్యాలు బ్రిడ్జిలు, ఎలక్ట్రిక్ విద్యుత్ ప్లాంట్లే : ట్రంప్ హూంకరింపు
- మధ్యప్రాచ్యంలో పాక్షికంగా ధ్వంసమైన అతి పెద్ద బ్రిడ్జి
- గల్ఫ్‌లోని ఎనిమిది కీలక వంతెనలు ఐఆర్‌జీసీ టార్గెట్



కువైట్- సూర్య వాస్తవం

పశ్చిమాసియాలో నెలరోజుల క్రితం మొదలైన యుద్ధం ఇప్పట్లో ఆగేలా కన్పించడం లేదు. ఇజ్రాయిల్-అమెరికా, ఇరాన్ సేనల మధ్య పోరు రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఇజ్రాయిల్‌పైనే కాకుండా కువైట్, బహ్రెయిన్ వంటి గల్ఫ్ దేశాలపై ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడులు శుక్రవారం కూడా కొనసాగాయి. కువైట్‌లో ప్రభుత్వ చమురు రిఫైనరీ మినా అల్-అహ్మదీపై డ్రోన్లతో ఇరాన్ దాడి చేయడంతో

- మిగతా 2లో..



మహిళా రిజర్వేషన్లు, ఎఫ్‌సిఆర్‌ఎ బిల్లుల కోసం

## పార్లమెంటు సమావేశాల పొడిగింపు

### - 16 నుంచి తిరిగి ఉభయ సభలు

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం:

మహిళా రిజర్వేషన్ల సవరణ బిల్లు, ఎఫ్‌సిఆర్‌ఎ సవరణ బిల్లు వంటి ముఖ్యమైన బిల్లులను ఆమోదింపజేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాలను పొడిగించేందుకు ప్రయత్నిస్తోంది. గురువారం బడ్జెట్ సమావేశాల రెండో దశ ముగిసిన తరువాత పార్లమెంట్ నిరవధికంగా వాయిదా పడుతుందని భావించారు. అయితే, సభా కార్యకలాపాలు ముగిసిన తరువాత, ఈ నెల 16న ఉదయం 11 గంటల వరకు సభ వాయిదా పడుతుందని

- మిగతా 2లో..



ఆ అభ్యర్థులను

## మాజీ సైనికులుగా పరిగణించవచ్చా

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం:

విభిన్నప్రతిభావంతులైన సైనిక అభ్యర్థులను మాజీ సైనికులుగా పరిగణించవచ్చా అని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. శిక్షణ సమయంలో వైకల్యానికి గురైన సైనిక అభ్యర్థులకు 'మాజీ సైనికుల' హోదా కల్పించవచ్చా, వారికి ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల ఉద్యోగాల్లో రిజర్వేషన్ ప్రయోజనాలు కల్పిస్తున్నారా అని ప్రశ్నించింది. విభిన్న ప్రతిభావంతులైన

- మిగతా 2లో..

# సిఆర్‌డిఏ గుర్తించిన ప్రాంతమంతా రాజధానే

-- 2028 నాటికి ప్రధాన పనులు కొలిక్కి
-- వైసీపీవి కుట్రలు, కుతంత్రాలు
-- మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు



అమరావతి - సూర్య వాస్తవం

పార్లమెంటు ఆమోదించిన ఈ చట్ట సవరణకు రాష్ట్రపతి ఆమోదం తెలిపిన తరువాత అమరావతికి పూర్తిస్థాయి చట్టబద్ధత వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సిఆర్‌డిఏ) గుర్తించిన ప్రాంతమంతా రాజధాని కిందే వస్తుందన్నారు. పార్లమెంటులో అమరావతి బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో సిఎం ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విభజన అనంతరం జరిగిన పరిణామాలను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. రాజధాని ఏర్పాటు, మూడు రాజధానుల బిల్లు, అమరావతి రైతుల ఉద్యమం వంటి వాటిని వివరించారు. భాషా ప్రయుక్త రాష్ట్రంగా

- మిగతా 2లో..



తెలంగాణ పోలీసుల

## హ్యాట్రిక్ విజయం

### - ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందనలు

హైదరాబాద్ - సూర్య వాస్తవం:

తెలంగాణ పోలీసు బృందాలు అల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో వరుసగా మూడోసారి ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీని గెలుచుకుని హ్యాట్రిక్ సాధించాయి. సీఐడీ పర్యవేక్షణలో నిరంతర శిక్షణతో ఈ విజయం నమోదు చేశాయి. వరుస విజయాలతో జాతీయ స్థాయిలో తెలంగాణ పోలీసులు మరో సారి తమ ప్రతిభ చాటుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర పోలీసు బృందానికి శుక్రవారం అభినందనలు తెలిపారు. డీజీపీ శివధర్ రెడ్డి, సీఐడీ అడిషనల్ డీజీ చారు సిన్హాను అభినందించారు. ఈ విజయం రాష్ట్ర పోలీసుల కృషి, క్రమశిక్షణకు నిదర్శనమని తెలిపారు.

- మిగతా 2లో..



నేడు 73 మండలాల్లో

## తీవ్ర వడగాడ్పులు

అమరావతి - సూర్య వాస్తవం

రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరగడంతో ఈ నెల 4న 73 మండలాల్లో తీవ్ర వడ గాడ్పులు, 17 మండలాల్లో వడగాడ్పులు, 5న 32 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు, 21 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఎండ తీవ్రత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టరు ప్రఖర్ జైన్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శనివారం నాడు శ్రీకాకుళం జిల్లాలో 16, విజయనగరం 24, పార్వతీపురం మన్యం 15, అల్లూరి 3, పోలవరం 9, అనకాపల్లి 2, కాకినాడ 3, తూర్పుగోదావరి 1 మండలాల్లో

- మిగతా 2లో..

# మెరుగైన విద్య అందిస్తాం

- ఒక్కో విద్యార్థిపై రూ.1.05 లక్షల ఖర్చు
- రాష్ట్రంలో రూ. 20వేల కోట్లతో 59 ఇంటిగ్రేటెడ్ స్కూల్స్
- విద్యార్థులకు రవాణా సౌకర్యం
- ఏఐని తట్టుకునేలా స్కిల్ డెవలప్‌మెంట్ చేసుకోవాలి
- భవిష్యత్ దృష్ట్యా స్కిల్ యూనివర్సిటీ
- ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతంలో ప్రజాప్రతినిధులు భాగస్వామ్యం కావాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఇంటర్‌నేషనల్ స్కూల్ ప్రారంభోత్సవం



రంగారెడ్డి - సూర్య వాస్తవం

విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం విద్యారంగంలో పలు మార్పులు తీసుకువచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రతి నియోజకవర్గం లోనూ 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం, గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు స్కూల్స్‌కు వెళ్లేందుకు రవాణా సౌకర్యం కూడా కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. శుక్రవారం రంగారెడ్డి

- మిగతా 2లో..



## వైసీపీ నేత పేర్నినాని పై కేసు నమోదు

మచిలీపట్నం - సూర్య వాస్తవం

వైసిపి నేత పేర్ని నానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం మచిలీపట్నంలోని కొబ్బరితోట ప్రాంతంలో శ్రీపతి వెంకటాచలం అనే వ్యక్తి అనుమతి లేకుండా ఇంటి నిర్మాణం

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

### ఆ అభ్యర్థులను
# మాజీ సైనికులుగా పరిగణించవచ్చా

(మొదటిపేజీ తరువాయి)

సైనిక శిక్షకుల్లో అత్యధిక శాతం మంది 30ఏళ్లలోపు వారని, వారికి ఉపాధి తప్పనిసరని జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఉజ్వల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. "వివిధ ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల్లో ఉద్యోగాలు, కీలక పదవుల కోసం ఇటువంటి వ్యక్తులకు కల్పించే రిజర్వేషన్ ప్రయోజనాన్ని పొందే ఉద్దేశంతో బోర్డెడ్ అవుట్ క్యాడెట్‌లను కూడా మాజీ సైనికులుగా లేదా మాజీ సైనిక సిబ్బందిగా పరిగణించవచ్చా లేదా అనే అంశం చర్చకు వచ్చిన వాటిల్లో ఒకటి" అని ధర్మాసనం పేర్కొంది. శిక్షణ సమయంలో వైకల్యం, గాయాల కారణంగా సైనికులుగా అర్హత పొందలేని శిక్షకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సుమోటోగా స్వీకరించిన సుప్రీంకోర్టు విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే.

### మహిళా రిజర్వేషన్లు, ఎఫ్‌సిఆర్ఎ బిల్లుల కోసం
# పార్లమెంటు సమావేశాల పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

అధికారిక ప్రకటన వెలువడింది. లోక్‌సభ, శాసనసభలలో సీట్లను పెంచేందుకు, మహిళా రిజర్వేషన్లను అమలు చేసేందుకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ఆమోదించేందుకే బడ్జెట్ సమావేశాలను పొడిగిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అదే సమయంలో, మైనారిటీల హక్కులను కాలరాసేందుకు తీసుకొస్తున్న బిల్లుగా విమర్శలు ఎదుర్కొంటున్న ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లును కూడా ఆమోదించి తీరాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఎఫ్‌సిఆర్ఎ సవరణ బిల్లుపై పార్లమెంట్ లోపల, వెలుపల భారీ నిరసనలు వెల్లువెత్తిన సంగతి విదితమే. కేరళం శాసనసభ ఎన్నికల ముందు ఈ బిల్లు ఆమోదం పొందితే బిజెపికి పెద్ద ఎదురుదెబ్బ తగులుతుందని కూడా కేంద్ర ప్రభుత్వం గ్రహించింది. కేరళలో ఎన్నికల తరువాత పార్లమెంట్ తిరిగి సమావేశమవుతుంది. ఈ పరిస్థితుల్లో, ప్రత్యేక సమావేశంలో ఎఫ్‌సిఆర్ఎ బిల్లును కూడా ఆమోదిస్తారన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

మహిళా రిజర్వేషన్లను అమలు చేయడానికి ఉద్దేశించిన రాజ్యాంగ సవరణలను ఎలా అమలు చేయాలన్న ప్రతిపక్షాల ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వం ఇంకా సమాధానం ఇవ్వలేదు. రాజ్యాంగ సవరణను ఆమోదించడానికి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపక్షాల మద్దతు కూడా అవసరం. అయితే, అఖిలపక్ష సమావేశం నిర్వహించడానికి గానీ, ప్రతిపక్షాల సందేహాలకు వివరణ ఇవ్వడానికి గానీ కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా లేదు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం తన సొంత ప్రయోజనాలకు అనుగుణంగా రిజర్వేషన్లను అమలు చేయడానికి ప్రయత్నిస్తోందన్న అనుమానం వ్యక్తమవుతోంది.

### తెలంగాణ పోలీసుల
# హ్యాట్రిక్ విజయం

(మొదటిపేజీ తరువాయి)

2024లో ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో, 2025లో జార్ఖండ్‌లోని రాంచీలో, 2026లో మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరిగిన 69వ అఖిల భారత పోలీస్ డ్యూటీ మీట్‌లో వరుసగా తెలంగాణ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచింది. ఈసారి నాగ్‌పూర్‌లో జరిగిన 69వ పోలీస్ డ్యూటీ మీట్‌లో రాష్ట్ర బృందం అద్భుత ప్రదర్శన కనబర్చింది. ఓవరాల్ ఛాంపియన్ ట్రోఫీతో పాటు యాంటీ-సాబోటేజ్ చెక్, వీడియోగ్రఫీ, కంప్యూటర్ అవేర్‌నెస్ విభాగాల్లో విజేతగా నిలిచింది. శాస్త్రీయ దర్యాప్తు సహాయాలు, పోలీస్ ఫోటోగ్రఫీ విభాగాల్లో రన్నరప్ సాధించింది.

### సిఆర్‌డిఎ గుర్తించిన
# ప్రాంతమంతా రాజధానే

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పడిన తొలి రాష్ట్రానికి రాజధాని లేకుండా పోయిందన్నారు. అందుకే చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందన్నారు. పార్లమెంటులో ఒక్క వైసిపి మినహా అన్ని పార్టీలూ మద్దతు తెలిపాయని అన్నారు. చట్టబద్ధత బిల్లును వైసిపి వ్యతిరేకించిందని, దేశంలోని అన్ని పార్టీలూ ఒకవైపు ఉంటే వైసిపి మాత్రం మరోవైపు నిలిచిందని విమర్శించారు. రాజధాని నిర్మాణం ఒక్క రోజులోనే పూర్తయ్యేది కాదని, నిరంతరం జరిగే ప్రక్రియ అని అన్నారు. క్రమానుగుణంగా నిర్మాణం, అభివృద్ధి జరుగుతాయని చెప్పారు. కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలతోనే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందన్నారు. హైదరాబాద్ ఒక్కటే తెలంగాణలో గరిష్ట ఆదాయాన్ని ఆర్జించి పెడుతోందన్నారు. మౌలిక సదుపాయాల నిర్మాణం పూర్తయితే అభివృద్ధి ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రస్తుతం రూ.56 వేల కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని, ప్రధాన పనులను 2028 నాటికి ఒక స్థాయికి తీసుకొస్తామన్నారు. పూర్తయిన పనులను 2029లో ప్రధాని మోడీతో ప్రారంభిస్తామని చెప్పారు. అమరావతితోపాటు తిరుపతి, విశాఖపట్నం ప్రాంతాలను కూడా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి నీటి భద్రత తీసుకొస్తామన్నారు. 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతామని, దీనికి చోదకశక్తిగా రాజధాని అమరావతి నిలుస్తుందని పేర్కొన్నారు. శాశ్వత రాజధానిగా అమరావతిని పార్లమెంటు చట్టం చేస్తే దానిని కూడా మార్చేస్తామని వైసిపి నేతలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రాజధానులు ఫెయిలవ్వడంతో మావిగన్ అంటూ ప్లాన్ బిని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని విమర్శిం చారు. రాష్ట్ర విభజన కంటే, జరిగిన నష్టం కంటే, వైసిపి పాలనలో విధ్వంసం ఎక్కువ జరిగిందని ఆరోపించారు. రాష్ట్ర ఆదాయం వేతనాలకే సరిపోతోందని, కేంద్రం ఇస్తున్న నిధులతో అప్పులకు వడ్డీలు చెల్లించడానికే సరిపోతుందని, నిర్వహణ కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని అన్నారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా మద్దతు ఇస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్రం కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా గ్యాస్ వంటి సమస్యలొచ్చాయని తెలిపారు. సరఫరా వ్యవస్థ దెబ్బతిని ధరలు పెరిగే అవకాశం ఉందని, ఇలాంటి సంక్షోభాలను ఎంత సమర్థవంతంగా ఎదుర్కోగలమనేది కీలకమన్నారు. అమరావతి అజేయం, శాశ్వతం, అన్‌స్టాపబుల్ అని, దీనికి అడ్డంకి కలిగించాలని చూస్తే వారివి పగటి కలలుగానే మిగిలిపోతాయని పేర్కొన్నారు.

# పోరు ఉధృతం

(మొదటిపేజీ తరువాయి)

పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. వాటిని అదుపు చేసేందుకు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ తెలిపింది. కువైట్‌లోని డీశాలినేషన్ (సముద్రపు నీటిని మంచినీరుగా మార్చే కేంద్రం) ప్లాంటుపై కూడా ఇరాన్ డ్రోన్ దాడి చేసింది. కాగా అమెరికాకు చెందిన మరో ఎఫ్-35 యుద్ధ విమానాన్ని కూల్చివేశామని ఇరాన్ ప్రకటించింది. ఈ దాడిలో విమాన పైలట్ ప్రాణాలతో బతికి బయటపడే అవకాశాలు లేవని తెలిపింది. ఇరాన్ దాడిలో అమెరికా యుద్ధ విమానం కూలిపోవడం ఇది రెండోసారి. అయితే తాజా దాడిపై అమెరికా ఇంకా స్పందించలేదు. ఇదిలావుండగా టెల్ అవీవ్, ఓడరేవు నగరమైన ఇలత్‌లపై దూర శ్రేణి క్షిపణులతో దాడి చేశామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ఒక ప్రకటనలో తెలిపారు. అబూధాబీలోని హబ్షన్ గ్యాస్ కేంద్రంపై జరిగిన వైమానిక దాడిని అడ్డుకునే క్రమంలో శకలాలు భూమిపై పడ్డాయి. ఆ ప్రాంతంలో మంటలు చెలరేగాయి. అయితే ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదు.

ఘటన జరిగిన తర్వాత గ్యాస్ కేంద్రంలో కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేశారు. అమెరికా-ఇజ్రాయిల్ జరిపిన దాడిలో ఇరాన్‌కు చెందిన క్వెషమ్ దీవిలోని ఓ ఓడరేవు దెబ్బతిన్నది. రాయిటర్స్ సంస్థ తాజాగా విడుదల చేసిన ఉపగ్రహ చిత్రం దీనిని ధ్రువీకరిం చింది. దాడి కారణంగా ఓడరేవులో కార్యకలాపాలు గురువారం తాత్కాలికంగా నిలిచి పోయాయి. పోర్ట్ ప్రాంతం నుంచి దట్టమైన పొగలు వ్యాపించాయి. మరోవైపు ఇరాన్ ప్రతీకార దాడులతో గల్ఫ్‌దేశాల్లో అగ్ని జ్వాలలు ఎగిసిపడ్డాయి. సౌదీలో ఉన్న అమెరికాకు చెందిన కీలక రాడార్ వ్యవస్థను ఇరాన్ దెబ్బతీసింది. మరో ఎఫ్..35 విమానా న్ని కూల్చేసింది. అయితే అధి ఎఫ్ 35 ఈగా నిర్ధారించారు. పైలెట్‌ను ఇరాన్ అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.

**ఒత్తిడి పెంచుతున్న ట్రంప్... లొంగబోమన్న ఇరాన్**

నయానో భయానో ఒప్పందం కుదుర్చుకునేలా ఇరాన్‌పై ఒత్తిడి పెంచేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే ఇరాన్‌లోని బ్రిడ్జిలు, ఎలక్ట్రిక్ విద్యుత్ ప్లాంట్లపై బాంబు దాడులు చేస్తామని బెదిరించారు. 'ఇరాన్‌లో ఇంకా మిగిలిన ఆస్తులేమైనా మిగిలి ఉంటే వాటిని ధ్వంసం చేసే పనిని మా సైన్యం ఇంకా ప్రారంభించలేదు. తదుపరి లక్ష్యం బ్రిడ్జిలు. ఆ తర్వాత ఎలక్ట్రిక్ విద్యుత్ ప్లాంట్లు' అంటూ ఆయన తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో ఓ పోస్ట్ పెట్టారు. 'ఏం చేయాలో ఇరాన్ నాయకత్వానికి తెలుసు. ఆ పని చేయడం కూడా తెలుసు. త్వరపడండి' అని అందులో హెచ్చరికలు చేశారు. బ్రిడ్జి కూల్చివేతపై ట్రంప్ సంతోషం వ్యక్తం చేశారు.

'ముందున్నది మొసళ్ల పండుగ' అంటూ ఇరాన్ నాయకత్వాన్ని బెదిరించే ధోరణితోనే ట్రూత్ సోషల్‌లో ఆయన ఆ పోస్ట్ పెట్టినట్టు కన్పిస్తోంది. దాడికి సంబంధించిన దృశ్యాలను ట్రంప్ ఆ పోస్టుకు జత చేశారు. ఇలాంటివే మరిన్ని దాడులు జరుగుతాయని హూంకరించారు. ఆలస్యం కాకముందే తమతో ఒప్పందం కుదుర్చుకోవాలని సుద్దులు చెప్పారు. ఈ ఘటనపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తీవ్రంగా స్పందించారు. 'పౌర మౌలిక సదుపాయాలపై దాడి చేయడాన్ని చూస్తుంటే గందరగోళంలో ఉన్న శత్రువు ఓటమికి, నైతిక పతనానికి ఈ ఘటన సంకేతంగా కన్పిస్తోంది' అని వ్యాఖ్యానించారు. నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిలు సహా పౌర మౌలిక సదుపాయాలపై దాడులు చేసినంత మాత్రాన ఇరాన్ ప్రజలు లొంగబోరని స్పష్టం చేశారు.

**హార్ముజ్‌పై పిల్లిమొగ్గలు**

హార్ముజ్ జలసంధిని తెరవాలంటూ నిన్నటి వరకూ గట్టిగా పట్టుపట్టిన ట్రంప్ ఇప్పుడు కొంత మెత్తపడినట్టు తెలుస్తోంది. హర్మూజ్‌ను ఇరాన్ మూసివేసినప్పటికీ ఆ దేశంపై సైనిక చర్యను ముగించాలని తాను కోరుకుంటున్నానని ఆయన తన సహాయకులకు చెప్పారని సమాచారం. జలసంధిని బలప్రయోగంతో తెరిపించాలన్న ట్రంప్ ప్రతిపాదనను చైనా, రష్యాలు ఇప్పటికే వ్యతిరేకించగా తాజాగా బహ్రెయిన్ వాటితో జత కలిసింది. జలసంధిలో చమురు నౌకల సురక్షిత ప్రయాణంపై పర్యవేక్షణ కోసం ఇరాన్, ఒమన్‌లు ఓ ప్రతిపాదనను ముందుకు తెచ్చాయి.

**అమెరికా వైమానిక బలమే టార్గెట్**

అమెరికా వైమానిక దళం విజయాలకు కారణమైన మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ విరుచుకు పడుతోంది. గత నెల 27న సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరంపై ఇరాన్ జరిపిన దాడిలో అమెరికా వైమానిక దళానికి చెందిన ఈ-3 సెంట్రీ (ఎయిర్ బార్న్ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టమ్) యుద్ధ విమానం దెబ్బతిన్న విషయం తెలిసిందే. అంతకుముందు మార్చి 13న ఐదు కేసీ-135 స్ట్రాటోట్యాంకర్ రీఫ్యూయలింగ్ విమానాలు దెబ్బతిన్నాయి. ఫిబ్రవరి 28న పోరు ప్రారంభమైనప్పటి నుంచి బహ్రెయిన్, కువైట్, ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈలలోని కనీసం ఏడు అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ దాడులు జరిపింది. ఈ దాడులలో రాడార్ వ్యవస్థలు, ఉపగ్రహ కమ్యూనికేషన్స్ అండ్ మిషన్ వ్యవస్థలు, కీలక విమానాలు ధ్వంసమయ్యాయి. ఇవన్నీ మధ్యప్రాచ్యంలో దాడులను పసిగట్టేందుకు, విమానాల రీఫ్యూయలింగ్‌కు, గగనతల దాడులకు అమెరికా దళాలు ఆధారపడుతున్న మౌలిక సదుపాయాలే. యుద్ధ ప్రారంభ సమయంలో అమెరికాకు చెందిన కమ్యూనికేషన్స్ మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ దాడులు జరిపింది. ఖతార్, యూఏఈలలోని రాడార్ వ్యవస్థలపై దాడులు చేసింది. ఆ తర్వాత క్షిపణి రక్షణకు చెందిన మౌలిక సదుపాయాలపై దాడులు జరిగాయి. సౌదీలోని అమెరికా రాడార్ వ్యవస్థపైనా ఇరాన్ విరుచుకుపడింది.

**కువైట్‌కు బహ్రెయిన్ నుంచి డ్రోన్ నిరోధక వ్యవస్థ**

కువైట్ రిఫైనరీపై ఇరాన్ దాడి చేసిన నేపథ్యంలో గల్ఫ్‌లో బ్రిటన్, కువైట్ ప్రయోజనాలను కాపాడే విషయంలో సాయపడాలని బహ్రెయిన్ నిర్ణయించింది. కువైట్‌కు రాపిడ్ సెంట్రీ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థను పంపుతోంది. ఈ వ్యవస్థ తక్కువ ఎత్తులో ఎగిరే డ్రోన్లను కూల్చివేస్తుంది. కువైట్ యువరాజు ప్రిన్స్ సబహ్ అల్-ఖలీద్ అల్ సబహ్‌తో శుక్రవారం ఉదయం బ్రిటన్ ప్రధాని కెయిర్ స్టార్మర్ టెలిఫోన్ సంభాషణ జరిపారు. కువైట్ చమురు రిఫైనరీపై జరిగిన ఇరాన్ డ్రోన్ దాడిని ఆయన ఖండించారు.

**పశ్చిమాసియా యుద్ధంలో లక్ష్యాలు ఇవే**

పశ్చిమాసియా యుద్ధంలో అమాయక ప్రజలు చవిచూస్తున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులు, వాటికి ప్రతీకారంగా గల్ఫ్ దేశాలపై టెహ్రాన్ చేపట్టిన ప్రతీకార దాడులలో పాఠశాలలు, ఆస్పత్రులు, విమానాశ్రయాలు, జనావాస ప్రాంతాలే లక్ష్యంగా మారుతున్నాయి. ఫలితంగా వేలాది మంది ప్రజలు చనిపోవడమో లేదా క్షతగాత్రులై జీవచ్ఛవాలుగా మారడమో జరుగుతోంది. సైనిక సంబంధమైన కేంద్రాలు, స్థావరాలే కాదు...పౌర మౌలిక సదుపాయాలు కూడా ధ్వంసమవుతున్నాయి. ఇరాన్‌లో ఇప్పటి వరకూ సుమారు 90 వేల జనావాస ప్రదేశాలపై దాడులు జరగగా రెండు వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. ఇప్పుడు పోరు లెబనాన్‌కు కూడా పాకింది. హెజ్బొల్లాలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ జరుపుతున్న దాడులలో భారీగానే ప్రాణనష్టం జరుగుతోంది.

ఇజ్రాయిల్‌పై ఇరాన్ జరిపిన ప్రతీకార దాడులలో కనీసం 19 మంది చనిపోగా వేలాది మంది గాయపడ్డారు. అమెరికా స్థావరాలకు ఆతిథ్యమిస్తున్న గల్ఫ్ దేశాలపై కూడా ఇరాన్ విరుచుకుపడుతోంది. ఇప్పటి వరకూ పాతిక మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. యుద్ధం ప్రారంభమైన రోజున ఇరాన్‌లోని మినాబ్‌లో ఉన్న షజారహ్ తయాబెహ్ బాలికల పాఠశాలపై క్షిపణి దాడి జరగగా కనీసం 170మంది బలయ్యారు. వీరిలో 7-12 ఏండ్ల మధ్య వయస్కు లైన బాలికల సంఖ్యే అధికంగా ఉంది. అదే రోజు అమెరికా ప్రయోగించిన ఓ కొత్త క్షిపణి సైనిక కాంపౌండ్ సమీపంలో ఉన్న జనావాసా లపై పడడంతో 21 మంది ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ ఇరాన్‌లోని ఐఆర్‌జీసీ స్థావరాన్ని లక్ష్యంగా చేసుకొని ప్రయోగించిన క్రూయిజ్ క్షిపణి సుమారు 200 మందిని పొట్టనపెట్టుకుంది. వీరిలో అత్యధికులు చిన్నారులే.

టెహ్రాన్‌లోని రెసాలత్ జిల్లాలో ఓ బహుళ అంతస్థుల భవనంపై గత నెల 9న జరిగిన వైమానిక దాడిలో యాభై మంది చనిపోగా అనేక మంది గూడును కోల్పోయారు. ఆర్థిక మౌలిక సదుపాయాలు, రవాణా కేంద్రాలు కూడా అమెరికా-ఇజ్రాయిల్ దాడులలో దెబ్బతిన్నాయి. చివరికి విద్యా సంస్థలను కూడా యుద్ధోన్మాదులు వదలలేదు. ఇరాన్ యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇస్ఫహాన్‌లోని వర్సిటీ, మలేక్ అష్తార్ యూనివర్సిటీ, ఇమామ్ హుస్సేన్ విశ్వవిద్యాలయంపై దాడులు జరిగాయి. ఇక ఆరోగ్య కేంద్రాలపై జరిగిన దాడులకు లెక్కే లేదు. బాంబు దాడుల కారణంగా ఇరాన్‌లోని అనేక ఆస్పత్రులు, వైద్య కేంద్రాలు దెబ్బతిన్నాయి. యుద్ధం తొలి దశలో ఆరోగ్య కేంద్రాలపై కనీసం 13 దాడులు జరిగాయని డబ్ల్యూహెచ్ఓ తెలియజేసింది. ఇజ్రాయిల్, గల్ఫ్ దేశాలపై ఇరాన్ జరిపిన ప్రతీకార దాడులలో కూడా గణనీయంగానే ప్రాణనష్టం జరిగింది.

**గందరగోళంలో ఆ రెండు దేశాలు : అరాగ్చి**

"నిర్మాణ పనులు పూర్తి కాని వంతెనలు, ప్రజలు వినియోగించే మౌలిక సదుపాయాలను ధ్వంసం చేసినంత మాత్రాన ఇరాన్ ప్రజలు సరెండర్ కారు. మా శత్రువులు (అమెరికా -- ఇజ్రాయిల్) ఓడిపోయారని ఇలాంటి దాడులతో తేటతెల్లం అవుతోంది. ఆ రెండు దేశాలు మాచేతిలో నైతికంగా ఓడిపోయి గందరగోళంలో పడ్డాయి" అని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి ఒక ట్వీట్ చేశారు.తమ దేశంపై జరిగే ప్రతీ దాడికి, ఇరాన్ ఐఆర్‌జీసీ ప్రతిదాడులతోనే సమాధానం చెబుతోంది. ఇజ్రాయిల్, గల్ఫ్ దేశాలపై ఇరాన్ అటాక్ చేస్తోంది. దీంతో ఈ యుద్ధం ఎడతెరిపి లేకుండా కొనసాగుతోంది. హోర్ముజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలు స్తంభించి భారత్ సహా ఆసియా దేశాలన్నీ ఇంధన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నా పట్టించుకోకుండా అమెరికా ఈ యుద్ధాన్ని సాగదీస్తోంది. పశ్చిమాసియా ప్రాంతంపై సైనికంగా తన పట్టును నిలుపుకునేందుకు పాకులాడుతోంది. రాబోయే 2-3 వారాల పాటు ఇరాన్‌పై అత్యంత తీవ్రమైన దాడులు చేస్తామని గురువారం ఉదయమే ప్రెసిడెంట్ ట్రంప్ ప్రకటించారు. ఈ పరిస్థితుల్లో యుద్ధం వల్ల ఇంకా ఎలాంటి ఆందోళనకర పర్యవ సానాలను చూడాల్సి వస్తుందో ఎవరికీ అంతుచిక్కడం లేదు.

### నేడు 73 మండలాల్లో
# తీవ్ర వడగాడ్పులు

(మొదటిపేజీ తరువాయి)

తీవ్ర వడగాడ్పులు వీచే అవకాశం ఉందని వెల్లడించారు. అలాగే శ్రీకాకుళం 2, పోలవరం 2, అనకాపల్లి 1, కాకినాడ 2, తూర్పుగోదావరి 3, ఏలూరు 4, ఎన్‌టిఆర్ 1, పల్నాడు 2 మండలాల్లో వడగాడ్పులు ప్రభావం చూపనున్నట్లు తెలిపారు. వడగాడ్పులు వీస్తున్నందున మహిళలు, పిల్లలు, వృద్ధులు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

### వైసీపీ నేత పేర్నినాని పై
# కేసు నమోదు

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టిన విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై స్పందించిన అధికారులు ఆ అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. ఈ ఘటన తర్వాత తన అనుచరులతో కలిసి అక్కడికి చేరుకున్న పేర్ని నాని, అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడున్న అధికారులను, పోలీసులను ఆయన బెదిరించినట్లు ఆరోపణలున్నాయి. ఈ పరిణామాల నేపథ్యంలో పోలీసు అధికారుల సంఘం చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో పేర్ని నానిపై ఫిర్యాదు చేసింది. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు ప్రారంభించారు.

# మెరుగైన విద్య అందిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

జిల్లా ఇబ్రహీంపట్నం మండల పరిధిలో ఏవీఎన్ లేక్‌ఫిల్డ్ ఇంటర్‌నేషనల్ స్కూల్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యావ్యవస్థను పటిష్టం చేసే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. 25 ఎకరాల్లో విశాలమైన విద్యాసంస్థను నిర్మించడంలో ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి ఆలోచన విధానం బాగుందని తెలిపారు. ఇదే తరహాలో ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను నిర్మాణం చేస్తోందన్నారు. 25 ఎకరాల్లో 2,500 మంది విద్యార్థులకు రెసిడెన్సియల్స్ క్యాంపస్‌ను నిర్మిస్తున్నామని చెప్పారు. మొదట దఫాలో 59 స్కూల్స్ నిర్మాణానికి రూ.20 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్టు తెలిపారు. ప్రస్తుత విద్యావ్యవస్థ నాణ్యత లేదన్నారు. 6వ తరగతి పిల్లలు తమ తరగతి పుస్తకం చదవమంటే చదవలేని స్థితిలో ఉన్నారన్నారు. ఆరో తరగతి చదువుతున్న పిల్లల్లో ఆ క్లాసు పుస్తకం చదవగలిగిన వారు 6.6 శాతం మాత్రమే అన్నారు. ఈ పరిస్థితి పోగొట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని తెలిపారు. నాటి దేశ ప్రధాని నెహ్రూ ప్రభుత్వ విద్యావ్యవస్థను నెలకొల్పారని అన్నారు. ఆయన ఆలోచనలతోనే దేశంలో నిరక్ష్యరాస్యత తగ్గిందన్నారు. ప్రస్తుతం వస్తున్న సాంకేతికతను తట్టుకుని నిలదొక్కుకోవడానికి స్కిల్స్ డెవలప్ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ దృష్ట్యా రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. విద్యతోపాటు క్రీడాల్లోనూ రాణించాలన్నారు. ప్రపంచ క్రీడాపోటీల్లో కూడా తెలంగాణ క్రీడాకారులు రాణించే విధంగా స్పోర్ట్స్ యూనివర్సిటీని కూడా నెలకొల్పనున్నట్టు చెప్పారు. విద్యారంగంలో ఒక్కో విద్యార్థిపైన ప్రభుత్వం రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తోందన్నారు. ఇంత ఖర్చు చేసినప్పుడు మెరుగైన విద్యను విద్యార్థులకు అందకపోవడం బాధకరమైన విషయమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితి లేకుండా కఠినమైన నిర్ణయాలు ఉండనున్నాయని స్పష్టం చేశారు. ప్రయివేటు రంగ సంస్థలు కూడా విద్య విషయంలోనూ నాణ్యతను ప్రదర్శించాలన్నారు.

# సంపాదకీయం





## రాష్ట్రాల్లో చట్టంగా మారుతున్న యూసీసీ

దేశవ్యాప్తంగా పలు రాష్ట్ర అసెంబ్లీలు  యూనిఫాం సివిల్ కోడ్ బిల్లుకు వరుసగా ఇప్పుడు అది చట్టంగా మారనుంది. ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) అవసరంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారు. ఒకే కుటుంబంలో ఇద్దరికి భిన్నమైన నిబంధనలు వర్తించకూడదు. అసలు ఒకే ఇంట్లో రెండు విధానాలు ఎలా సాధ్యం?" అని ప్రధాని మోదీ ప్రశ్నించారు. ఒకవేళ ఒకే ఇంట్లోని కుటుంబంలో ఇద్దరు వ్యక్తులకు రెండు రకాల చట్టాలుంటే, ఆ ఇల్లు నడవదు" అని అన్నారు.చట్టం కూడా సమానత్వం గురించే మాట్లాడుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని మోదీ అన్నారు.ఈ బిల్లు మహిళలకు ప్రయోజనకరమని ప్రజావేదికల పైనా, మీడియాతోనూ, శాసనసభలోనూ మంత్రులు పదేపదే చెబుతున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందాక, గుజరాత్‌లో మహిళల స్థితిగతులు, లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌ల గురించి కూడా చర్చ మొదలైంది.ఈ బిల్లు వల్ల మహిళలకు పెద్దగా ప్రయోజనం ఉండదని, పైగా సామాజిక సమస్యలు పెరుగుతాయని కొందరు నిపుణుల అభిప్రాయం. మరోవైపు, అణగారిన వర్గాల మహిళలకు ఈ బిల్లు వల్ల మేలు జరుగుతుందని మరికొందరు అంటున్నారు.యూనిఫాం సివిల్ కోడ్ బిల్లులో మహిళల కోసం ఉన్న ముఖ్యమైన నిబంధనలు ఏమిటి, వారికి ఎలాంటి కొత్త హక్కులు కల్పించబోతున్నారు?నిపుణులు ఏమంటున్నారు?ప్రతి మహిళకు వారసత్వ ఆస్తిలో సమాన వాటా లభిస్తుంది. మతం ఆధారంగా మహిళల కోసం ఎటువంటి ప్రత్యేక నిబంధనలు ఉండవుసామాజిక సంప్రదాయాల ప్రకారం ఇచ్చే విడాకులు కాకుండా, కోర్టు ద్వారా మంజూరయ్యే విడాకులు మాత్రమే చెల్లుబాటు అవుతాయి.వివాహం ప్రతి మతంలో వారి ఆచారాల ప్రకారం చేసుకోవచ్చు, కానీ వివాహం రిజిస్ట్రేషన్ చేయించుకోవడం తప్పనిసరి.లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉన్న మహిళను భాగస్వామి వదిలేస్తే, ఆమెకు భరణం పొందే హక్కు ఉంటుంది, వారికి పుట్టిన బిడ్డకు వారసత్వ హక్కులు లభిస్తాయి.వారసత్వ ఆస్తికి సంబంధించి ఎటువంటి వీలునామా రాయకపోతే స్థిరాస్తులు, చరాస్తులలో మహిళకు సమాన హక్కు లభిస్తుంది.ఏ మతంవారైనా సరే ఒక భార్య ఉండగా రెండో వివాహం చేసుకోకూడదనే నియమం తీసుకొచ్చారు.భర్త విడిచిపెట్టిన మహిళలకు న్యాయం చేసే అంశం కూడా ఈ బిల్లులో ఉంది.కోర్టు ద్వారానే కచ్చితంగా విడాకులు తీసుకోవాలనే నిబంధన గురించి రిటైర్డ్ జడ్జి జ్యోత్స్నా యాజ్ఞిక్ మాట్లాడారు."యూనిఫాం సివిల్ కోడ్‌లో సామాజిక పద్ధతుల్లో ఇచ్చే విడాకులను అంగీకరించే బదులు, కోర్టు ద్వారానే విడాకులు తీసుకోవడం తప్పనిసరి చేశారు. అయితే ప్రస్తుత పరిస్థితిని గమనిస్తే, ఫ్యామిలీ కోర్టులలో ఇప్పటికే విడాకుల కేసులు భారీగా పెండింగ్‌లో ఉన్నాయి. అటువంటప్పుడు రాబోయే రోజుల్లో విడాకుల కేసుల భారం మరింత పెరుగుతుంది" అన్నారు యాజ్ఞిక్."ప్రస్తుతం చాలా కులాల్లో సామాజిక పద్ధతుల్లో జరిగే విడాకులు ఇకపై చెల్లకుండా పోతాయి. దీనివల్ల ఫ్యామిలీ కోర్టుల్లో కేసుల పరిష్కారానికి ఎక్కువ సమయం పడుతుంది. కొన్ని కేసుల్లో తక్కువ వయసున్న అమ్మాయిలు లేదా అబ్బాయిల విడాకుల పిటిషన్లు సరైనవే అయినప్పటికీ, ఇటువంటి పరిస్థితుల్లో కేసులు సుదీర్ఘకాలం కొనసాగుతాయి. దీనివల్ల విడాకుల తర్వాత తిరిగి వివాహం చేసుకునే అవకాశం చాలామందికి తగ్గిపోతుంది" అని జ్యోత్స్నా యాజ్ఞిక్ చెప్పారు."చాలా సమాజాలలో 'లేఖణి', 'సాటాపాటా' వంటి ఆచారాలు ఇంకా కొనసాగుతున్నాయి. ఇటువంటి సంప్రదాయ పద్ధతుల ద్వారా జరిగే విడాకుల ప్రక్రియ దుర్వినియోగమవుతున్నట్లు 2021 చివరిలో గుజరాత్ హైకోర్టులో జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ నానావతి ధర్మాసనం గుర్తించింది. అయినప్పటికీ, నేటికీ ఈ పద్ధతులు కొనసాగుతున్నాయి. తక్కువ చదువుకున్నవారు, ఆత్మగౌరవం కోసం విడాకులు తీసుకునే మహిళలు ఈ పద్ధతుల ద్వారా విడాకులు పొందినా స్వల్ప కాలంలోనే మరో వివాహం చేసుకోగలుగుతున్నారు. ఇప్పుడు కోర్టులలో ఇటువంటి కేసుల భారం పెరిగి, న్యాయమూర్తుల సంఖ్య తక్కువగా ఉంటే, కొన్ని కులాలకు చెందిన మహిళలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది" అని ఆమె అభిప్రాయపడ్డారు."మహిళలకు అత్యంత ప్రమాదకరమైన నిబంధన ఏదైనా ఉందంటే, అది లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌కు గుర్తింపునివ్వడమే. ఈ సంబంధాలను రిజిస్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి చేశారు. గతంలో లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లో ఉండేవారు సమాజానికి భయపడేవారు. కానీ ఇప్పుడు బహిరంగంగా, చట్టబద్ధంగా ఇటువంటి సంబంధాల్లో ఉండవచ్చు. కొత్త తరంలో లివ్-ఇన్ రిలేషన్‌షిప్‌లకు ఈ విధంగా గుర్తింపు లభిస్తే, సమాజాన్ని ఏకంగా ఉంచే వివాహ వ్యవస్థ బలహీనపడిపోతుంది. ఇది రాబోయే రోజుల్లో ప్రమాదకరం" అని న్యాయవాది పూజా ప్రజాపతి అభిప్రాయపడ్డారు"లివ్-ఇన్ రిలేషన్‌షిప్ ద్వారా జన్మించిన బిడ్డకు కూడా హక్కులు కల్పించే అంశం ఈ చట్టంలో ఉంది. ఈ సంబంధాల వల్ల కలిగే పిల్లల విషయంలో స్త్రీ, పురుషుల మధ్య కొత్త చట్టపరమైన వివాదాలు తలెత్తుతాయి. లివ్-ఇన్‌లో ఉన్న మహిళపై ఆరోపణలు వస్తే, కొత్త గొడవలు మొదలయ్యే అవకాశం ఉంది. దీనివల్ల మహిళలకు ఎక్కువ నష్టం కలగవచ్చు. అంతేకాకుండా, 18 నుంచి 21 ఏళ్ల లోపు యువతీ యువకులు లివ్-ఇన్ రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వారి తల్లిదండ్రులకు సమాచారం అందించాలనే నిబంధన ఉంది. దీనివల్ల కొత్త సామాజిక సంఘర్షణలు మొదలవుతాయి. ఈ యూనిఫాం సివిల్ కోడ్ వల్ల దీర్ఘకాలంలో ప్రయోజనం కంటే వివాహ వ్యవస్థకే ముప్పు పొంచి ఉంది" అని చెప్పారు.యూనిఫాం సివిల్ కోడ్ ద్వారా విడాకుల కేసుల్లో మహిళలకు తక్షణమే భరణం అందడం, వివాహం జరిగిన ఏడాది తర్వాతే విడాకుల కేసు దాఖలు చేయాలనే నిబంధనలు మంచి పరిణామాలే. అయితే, మహిళలకు దీనివల్ల ఏవో పెద్దఎత్తున ప్రయోజనాలు కలుగుతాయని మాత్రం అనిపించడం లేదు" అని పూజా ప్రజాపతి అన్నారు.




## రాంగ్ ట్రాక్‌లో తమ్ముళ్లు..
# దారికి తెచ్చే పనిలో సీఎం



**గుంటూరు-సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ఎమ్మెల్యేలు, అధికారుల మధ్య సమన్వయం కుదరడం లేదన్న విమర్శలు పెరిగి పోతున్నాయి. తాము చెప్పిన పనులు జరగడం లేదని, అధికారుల నుండి సరైన గౌరవం దక్కడం లేదని అధికార పార్టీ ఎమ్మెల్యేలు బహిరంగంగానే అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. తాజాగా పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయంలో నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ఏకంగా పది గంటల పాటు ధర్నాకు దిగడం, గదిలో బంధించుకుని నిరసన తెలపడం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. తాము సిఫార్సు చేసిన వారికే పోస్టింగ్ ఇవ్వాలన్న పట్టుదల, అధికారులపై ఒత్తిడి తేవడం వంటి పరిణామాలు ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీస్తున్నాయని పార్టీ అధిష్టానం భావిస్తోంది. ఎమ్మెల్యేల ప్రవర్తనపై తీవ్ర అసంతృప్తితో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఈ ఉద్రేకాలకు అడ్డుకట్ట వేసేందుకు సరికొత్త వ్యూహాన్ని తెరపైకి తెచ్చారు. ఎమ్మెల్యేలందరూ తమ భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలని, నిరంతరం ఒత్తిడికి గురవుతున్న వారు మెడిటేషన్  చేయాలని ఆయన సూచించారు. గతంలో కూడా చంద్రబాబు తన కేబినెట్ సహచరులకు, అధికారులకు ఈషా ఫౌండేషన్ వంటి ఆధ్యాత్మిక సంస్థల ద్వారా యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలను నిర్వహించిన అనుభవం ఉంది. ఇప్పుడు మళ్ళీ అదే పద్ధతిలో ఎమ్మెల్యేల మనసులను ప్రశాంతం చేయాలని, వారు ప్రజల మధ్య సంయమనంతో ఉండేలా చేయాలని బాబు భావిస్తున్నారు.చాలామంది ఎమ్మెల్యేలు తాము గెలిచిన నియోజకవర్గాలకు  మేమే కింగులం  అనే భావనలో ఉండటం వల్లే ఇలాంటి ఘర్షణలు తలెత్తుతున్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అధికారులపై హుకుం జారీ చేయడం, వారి గౌరవానికి భంగం కలిగించడం ద్వారా పనులు జరగవని, అది కేవలం అరాచకానికి దారితీస్తుందని చంద్రబాబు హెచ్చరిస్తున్నారు. పెన్షన్ల పంపిణీ వంటి సేవా కార్యక్రమాల్లో కూడా ఆయన ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. అధికారం అంటే బాధ్యత అని, అది అహంకారానికి వేదిక కాకూడదని హితవు పలికారు. ధ్యానం ద్వారా ఎమ్మెల్యేలలో ఉన్న ఆ అహంకారాన్ని తొలగించి, వారిని సేవా మార్గంలోకి మళ్లించడమే బాబు లక్ష్యంగా కనిపిస్తోంది.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం, పోలీస్ స్టేషన్లు,  ఎస్పీ కార్యాలయాల ముందు ధర్నాలు చేయడం వంటి చర్యలు గత ప్రభుత్వం చేసిన తప్పులను గుర్తు చేస్తున్నాయని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే ఈసారి కేవలం హెచ్చరికలతోనే సరిపెట్టకుండా, ఎమ్మెల్యేల పనితీరుపై నిఘా పెట్టడమే కాకుండా వారికి మానసిక వికాస తరగతులు  నిర్వహించాలని ఆలోచిస్తున్నారు. ఒకవేళ ధ్యానం, యోగా వంటి శిక్షణల తర్వాత కూడా ఎమ్మెల్యేల తీరు మారకపోతే, కఠిన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోమని ఆయన స్పష్టమైన సంకేతాలు పంపారు. ప్రస్తుత రాజకీయాల్లో కేవలం గెలిస్తే సరిపోదు, ప్రజల ముందు ఎలా ప్రవర్తిస్తున్నామనేది కూడా ముఖ్యమని చంద్రబాబు నమ్ముతారు. రాబోయే రోజుల్లో ఎమ్మెల్యేలందరికీ ప్రొఫెషనల్ ట్రైనర్లతో వర్క్ షాప్‌లు నిర్వహించే అవకాశం ఉంది. నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల కంటే కూడా నాయకుల ప్రవర్తనే ఎన్నికల్లో కీలకం కానుందని, అందుకే ఎమ్మెల్యేలు తమ బాడీ లాంగ్వేజ్ ను మార్చుకుని, అధికారులతో కలిసి పని చేయాలని అధిష్టానం నిర్దేశించింది. ఈ  మెడిటేషన్ మంత్రం ఎంతవరకు ఎమ్మెల్యేలలో మార్పు తెస్తుందో వేచి చూడాలి.

## కాంగ్రెస్‌లో గొంతు లేస్తోంది...



**హైదరాబాద్-సూర్య వాస్తవం:**
కాంగ్రెస్ పార్టీ అంటే సాధారణంగా ఒక అభిప్రాయం అందరికీ ఉంది. అదే అపరిమితమైన స్వేచ్ఛ ఆ పార్టీలో ఉంటుంది. ఎవరైనా తమ సొంత అభిప్రాయాలను ఏ వేదిక మీద అయినా హాయిగా చెప్పవచ్చు. అది కాంగ్రెస్ పార్టీలో ప్లస్ అదే మైనస్ కూడా. అంతర్గత ప్రజాస్వామ్యంలో కాంగ్రెస్‌ని మించిన పార్టీ వేరొకటి లేదు. అయితే అసంతృప్తులు అయినా పార్టీ వేదికల మీద నాలుగు గోడల మధ్యన చెబితేనే బాగుంటుంది. కానీ బాహాటం అయితే పార్టీ ప్రభుత్వం రెండూ ఇబ్బందుల్లో పడతాయని అంటున్నారు. ఈసారి బడ్జెట్ సెషన్ లో కాంగ్రెస్ కి కొంత ఇరకాటం ఏర్పడే విధంగా సన్నివేశాలు కనిపించాయి. అసెంబ్లీలో నల్గొండ జిల్లా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అయితే ఏకంగా ప్రభుత్వం మీద విమర్శలు చేశారు.

ఖమ్మం జిల్లాతో పాటు సీఎం సొంత నియోజకవర్గంలో పనులు చేసిన కాంట్రాక్టర్లకు మాత్రమే బిల్లులు చెల్లిస్తున్నారని అదే ఇతర ప్రాంతాలలో కాంట్రాక్టర్లకు పెండింగులో పెడుతున్నారని వాపోయారు. అంతే కాదు ఎమ్మెల్యేలు గెలవకపోతే సీఎం కానీ మంత్రులు కానీ ఎక్కడ అని లాజిక్ పాయింట్ లేవదీశారు. అంతటితో ఊరుకోలేదు, తన నియోజకవర్గాలలో అభివృద్ధి పనులు సాగడం లేదని అచ్చం విపక్షం గొంతుకతో విమర్శలు చేశారు. ఎమ్మెల్యేలకు నియోజకవర్గం నిధులు ఇవ్వకపోతే ఎలా అని ఆయన ప్రశ్నించారు. ఒక విధంగా కోమటిరెడ్డి మాటలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పూర్తిగా డిఫెన్స్‌లో పడేశాయని అంటున్నారు ఇక శాసనమండలిలో చూస్తే ఎమ్మెల్సీ విజయశాంతి కాంగ్రెస్ ప్రభుత్వం మీద తనదైన శైలిలో విమర్శలు చేశారు. ఉద్యమ కారులకు ప్రభుత్వం చేసిన న్యాయం ఏమిటని సూటిగా ప్రశ్నించారు. వారికి ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చామని రెండేళ్ళు అవుతున్నా ఇంకా వాటిని నెరవేర్చలేదని ఆమె విమర్శించారు. ఉద్యమంలో అమరులైన కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని చెప్పారని అలాగే ఉద్యమ కారులకు నెలకు పాతిక వేల రూపాయల గౌరవ భృతి ఇస్తామని హామీ ఇచ్చారని ఆమె గుర్తు చేశారు. ఉద్యమకారులు లేకపోతే సీఎం అయినా మంత్రులు అయినా ఉండేవారా అని ఆమె నిలదీసినంత పని చేశారు.

ఈ విధంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇద్దరూ తమ సొంత ప్రభుత్వం మీద విమర్శలు గుప్పించడంతో కొంత ఇబ్బం దికరమైన పరిస్థితిలో ప్రభుత్వం పడింది అని అంటున్నారు. జీవన్ రెడ్డితో మొదలు : ఇక సీనియర్ మోస్ట్ కాంగ్రెస్ లీడర్ మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ మీద తీవ్ర విమర్శలు చేసి పార్టీ వదిలి వెళ్లారు. పార్టీలో ఉంటూ ఈ ఇద్దరూ ఒకింత అసంతృప్తితోనే ప్రభుత్వం మీద విమర్శలు చేశారు అని అంటున్నారు. ఇంకా చాలా మంది తమలోపల అసంతృప్తిని దాచుకున్నారు అని అంటున్నారు.

ఇప్పటిదాకా ఒక ఎత్తు ఇక మీదట మరో ఎత్తు అన్నట్లుగానే ఈ పరిస్థితి కాంగ్రెస్‌లో ఉందని అంటున్నారు. అయితే ఈ అసంతృప్తిని తగ్గించే ప్రయత్నం చేయాలి. అలాగే బహిరంగ విమర్శలు చేయకుండా చూసుకోవాలి. ఇప్పటి నుంచే డ్యామేజ్ కంట్రోల్ చేసుకోకపోతే విపక్షాలకు ఇది ఆయుధంగా మారుతుందని గతానుభవాలను చూసిన వారు కాంగ్రెస్ లో పెద్దలుగా ఉన్న వారు హితైషులు చెబుతున్నారు.





## పోలీస్ నిఘా నీడలో అనంతపురం రైల్వే స్టేషన్, బస్ స్టాండ్

**- డాగ్ స్క్వాడ్ ద్వారా విస్తృతంగా తనిఖీలు**

**- అనుమానితులు, వారి బ్యాగులు, లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్  ఆదేశాల మేరకు... అనంతపురం రైల్వే స్టేషన్, బస్ స్టాండ్, పార్సిల్ కార్యాలయంలో డాగ్ స్క్వాడ్ ద్వారా స్థానిక మూడవ పట్టణ పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. సి.ఐ రాజేంద్రనాథ్ యాదవ్ పర్యవేక్షణలో ఈరోజు ఉదయం నుండి తనిఖీలు చేపట్టారు. డ్రగ్స్ నియంత్రణే లక్ష్యంగా తనిఖీలు కొనసాగాయి. నార్కోటిక్స్ పసిగట్టడంలో తర్ఫీదు పొందిన టైగర్ జాగిలం ద్వారా విస్తృత తనిఖీలు చేశారు. సాధారణ ప్రయాణీకులకు అసౌకర్యం కల్గకుండా ఈ తనిఖీలు కొనసాగాయి. గంజాయి, అక్రమ మద్యం రవాణా జరుగకుండా లోతుగా చెక్ చేశారు. అనుమానాస్పదులు, వారి లగేజీలను టైగర్  జాగిలం ద్వారా లోతుగా తనిఖీ చేశారు. ఏదైనా మాదక ద్రవ్యాల సమాచారం ఉంటే వెంటనే ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 లేదా 112 కు సమాచారం అందించాలని ప్రజలకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా హ్యాపీ క్లబ్ వేడుకలు



**తిరుపతి -సూర్య వాస్తవం :**
తిరుపతి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో తారకరామా నగర్ శ్రీ చైతన్య పాఠశాలలో వినూత్నంగా అడాప్షన్ కార్యక్రమంలో భాగంగా ప్రైమరీ హై స్కూల్ విద్యార్థులు తల్లిదండ్రులు హ్యాపీ క్లబ్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సురేష్ పాల్గొన్నారు ఈ సందర్భంగా ప్రిన్సిపల్ లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ... తల్లిదండ్రుల ఉపాధ్యాయుల మధ్య స్నేహపూర్వక సంబంధం మరింత బలపడేందుకు ఇలాంటి కార్యక్రమాలు దహాలు పడుతున్నాయి అన్నారు కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం , పిల్లలు పాల్గొన్నారు.



## రాజధాని అమరావతి చట్టబద్ధతపై

# వైకాపాది సెల్ఫ్ గోల్..టీడీపీది సెల్ఫ్ డబా

### - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం:** రాజధాని అమరావతి చట్టబద్ధతపై వైకాపా పార్టీ ది సెల్ఫ్ గోలని,టిడిపి పార్టీది సెల్ఫ్ డబ్బా అని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి విరుచుకుపడ్డారు. శుక్రవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఒకే రాష్ట్రం - ఒకే రాజధాని - అదీ అమరావతి, దేవతల రాజధాని అమరావతి,ఆంధ్రుల రాజధాని అమరావతి అని కాంగ్రెస్ పార్టీ మొదటి నుండి ఒకే విధానం మీద,ఒకే స్టాండ్ మీద ఉందని తులసి రెడ్డి వివరించారు. కానీ వైకాపా పార్టీ రాజధాని అమరావతి విషయంలో మొదటి నుంచి గందరగోళంలో,అయోమయంలో, కన్ఫ్యూజన్లో ఉందని తులసి రెడ్డి అన్నారు. 2019 ఎన్నికలకు ముందు ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత రాజధానిని విశాఖపట్నం కు మార్చాలంటూ మూడు ముక్కలాట ఆడారు. అధికారం పోయిన తర్వాత ప్రస్తుతం మావిగన్ ఫార్ములా అంటున్నారు అంటే మచిలీపట్నం - విజయవాడ- గుంటూరు అని పాట పాడుతున్నారు . బహుశా రేపు శ్రీవిపుల్ అనగా శ్రీకాకుళం -విజయవాడ- పులివెందుల పాట పాడవచ్చు.ఏది ఏమైనా రాజధాని అమరావతి విషయంలో వైకాపా పార్టీ సెల్ఫ్ గోల్ కొట్టుకుందని తులసి రెడ్డి అన్నారు.

రాజధాని అమరావతి చట్టబద్ధత విషయంపై టిడిపిది సెల్ఫ్ డబ్బా అని తులసి రెడ్డి అన్నారు. ఇది కొత్తగా ఏర్పాటు అయింది కాదు. పది సంవత్సరాల నుంచి రాజధాని అమరావతి నుంచే పరిపాలన సాగుతోంది. ఇప్పటికే రెండుసార్లు ప్రధానమంత్రి శంకుస్థాపన కూడా చేశారు.ఇది ఏదో కొత్తగా రాజధాని అయినట్లు, కనీవినని అద్భుతం జరిగినట్లు టిడిపి నాయకులు సంబరాలు చేసుకోవడం విడ్డూరమని,అతి సర్వత్రా వర్జయేత్ అని తులసి రెడ్డి అన్నారు. ఇప్పటికైనా అమరావతి చట్టబద్ధతపై ప్రచారం తగ్గించుకొని చేయవలసిన వాటిపై దృష్టి సారించాలని తులసి రెడ్డి సూచించారు. విభజన చట్టంలో సెక్షన్ 94 సబ్ సెక్షన్ 3 ప్రకారము రాజధానిలో రాజ్ భవన్,రాష్ట్ర సచివాలయము,శాసనసభ భవనము శాసనమండలి భవనము,హైకోర్టు తదితర మౌలిక సదుపాయాలకు కేంద్ర ప్రభుత్వం గ్రాంట్ రూపంలో నిధులు ఇవ్వాలని స్పష్టంగా పేర్కొనడం జరిగింది. ఈ చట్టం ప్రకారము కేంద్ర ప్రభుత్వంతో పోరాడి రాజధానికి కేంద్రం నుండి గ్రాంట్ రూపంలో నిధులు తెప్పించి, ప్రజా రాజధానిని నిర్మించాలని తులసి రెడ్డి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి సూచించారు. అమరావతి పేరు చెప్పి అందిన కాడల్లా అప్పు తెచ్చి రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేయవద్దని సూచించారు. రాజధాని నిర్మాణంలో అవినీతికి, దుబారాకు ఆస్కారము కల్పించవద్దని అన్నారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులకు రెసిడెన్షియల్, కమర్షియల్ ప్లాట్స్ అలాట్ చేసి, లేఔట్స్ వేసి,వాటిని అభివృద్ధిపరిచి రైతులకు అప్పగించాలని తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర జల సంఘం ఇచ్చిన అనుమతి ప్రకారము పోలవరం బహుళర్త సాధక ప్రాజెక్టును 150 అడుగుల ఎత్తులో నిర్మించి జాతికి అంకితం చేయాలని సూచించారు. విభజన చట్టంలో సెక్షన్ 46 సబ్ సెక్షన్ మూడు ప్రకారము రాయలసీమకు,ఉత్తరాంధ్రకు కేంద్ర ప్రభుత్వం బుందేల్ఖండ్ తరహా ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీ నిధులు ఇవ్వాలి.విభజన చట్టంలో 13వ షెడ్యూల్ ప్రకారము కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ నిర్మించాలి. దుగ రాజపట్నంలో మేజర్ వద్ద రేవు నిర్మించాలి. వీటిపైన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.సమైక్యాంధ్రప్రదేశ్లో హైదరాబాదును ఫ్రీ జోన్ గా చేసినట్లే నవ్యాంధ్రప్రదేశ్ లో రాజధాని అమరావతిని ఫ్రీ జోన్గా ఏర్పాటు చేయాలని తులసి రెడ్డి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

ఏసుక్రీస్తు బోధనలు ఆధునిక సమాజానికి ఎంతో అవసరం. అశాంతితో అలమటిస్తున్న ఆధునిక సమాజానికి ఏసుక్రీస్తు బోధనలు, ఉపదేశాలు, ఆయన జీవన విధానము ఎంతో అవసరం అని తులసి రెడ్డి అన్నారు. సేవ, క్షమ,ప్రేమ, శాంతి తదితర ఏసుక్రీస్తు బోధనలు సార్వకాలీనం, సార్వ ప్రాంతీయం,సార్వజనీయమన్నారు. ప్రపంచ శాంతి కోసం తనను తాను అర్పించుకున్న త్యాగమూర్తి ఏసుక్రీస్తు అన్నారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ గౌడ్, ఎస్సీ సెల్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లె విజయభాస్కర్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, నామా వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## వజ్రకరూర్ సర్పంచ్‌కు ఘన సన్మానం




**ఉరవకొండ - సూర్య వాస్తవం:** వజ్రకరూరు మండలంలోని పంచాయతీ కార్యాలయం నందు సర్పంచ్ మోనాలిసా పదవీకాలం పూర్తయిన సందర్భంగా పంచాయతీ కార్యాలయం నందు గ్రామ ప్రజలు అభినందన సభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరి ప్రసాద్ యాదవ్, వజ్రకరూరు తహసిల్దార్ నరేష్ పాల్గొన్నారు.నరేష్ ప్రసంగిస్తూ గ్రామ అభివృద్ధికి సర్పంచ్ మోనాలిసా అహర్నిశలు కృషి చేసి ప్రజల మన్ననలు పొందారని పేర్కొన్నారు.హరి ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ నిరంతరం ప్రజాక్షేత్రంలో ఉంటూ, ప్రజల మన్ననలు పొందిన ఆదర్శవంతమైన సర్పంచ్ అని ఆమెను అభినందించారు. అనంతరం ఘనంగా సత్కరించారు. అనంతరం మోనాలిసా మాట్లాడుతూ తన సన్మానం సభలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేసారు.

### పంట' తడిసి ధరలు లేక

## కుదేలవుతున్న మిర్చి రైతులు

**- ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని రైతుల ఆవేదన**



**ఉరవకొండ-సూర్య వాస్తవం:** ప్రస్తుత పరిస్థితుల్లో మిరప రైతులు అత్యంత బాధాకరమైన సవాళ్లను ఎదుర్కొంటున్నారు. వాతావరణం అనుకూలించక ఒకవైపు పెట్టుబడి పెరగడం, మరోవైపు మార్కెట్లో ధరలు తగ్గడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. ?నవంబరు, డిసెంబరు నెలల్లో అకాల వర్షాలు లేదా తేమ వంటి ప్రతికూల పరిస్థితుల వల్ల తెగుళ్లు ఆశించే అవకాశం ఉంటుంది. వాటిని అరికట్టడానికి రైతులు రోజు మార్చి రోజు మందులు పిచికారీ చేయడం వల్ల సాగు ఖర్చు ఊహించని విధంగా పెరిగిపోయింది.మూడు నెలల క్రితం క్వింటాకు 85,000 పలికిన డబ్బీ రకం ధర, ఇప్పుడు 55,000 నుండి 65,000 కు పడిపోవడం రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. అంటే క్వింటాకు దాదాపు 20,000 నుండి 30,000 వరకు నష్టం వాటిల్లుతోంది. గిట్టుబాటు ధర రాకపోవడంతో రైతులు తమ దిగుబడిని అమ్ముకోలేక, మార్కెట్ యార్డుల్లోనూ, పొలాల్లోనూ నిల్వ చేసుకుని వ్యాపారుల కోసం వేచి చూస్తున్నారు. ఇది నిల్వ సామర్థ్యం లేని రైతులకు మరింత భారంగా మారుతుంది.

## చౌడేశ్వరి ఆలయంలో భక్తి శ్రద్ధలతో పూజలు




**పులివెందుల-సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు చౌడమ్మ వీధిలో కొలువైన శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శుక్రవారము పురస్కరించుకుని ఉదయస్తమాన ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవ విశేష పంచామృతాభిషేకం,కుంకుమార్చన ,మహా మంగళహారతి తదితర పూజా కైంకర్యాలు అనంతరం అమ్మవారు విశేష పూల అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.ప్రత్యేకించి ఆలయున ఉదయం 10.30 నిమిషములకు రాహుకాల దీపాలు వెలిగించి రాహుకాల పూజలు నిర్వ హించి అమ్మవారి ఆశీస్సులు పొందారు..ఈ సందర్భముగా ఆలయ నిర్వాహకులు రాజేంద్రప్రసాద్ ,అర్చకులు ప్రవీణ్ స్వామి మాట్లాడుతూ ప్రతి శుక్ర,పౌర్ణమి,అమావాస్య రోజున అమ్మవారికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి చీర వడిబయ్యము,కుంకుమార్చన,బోనాలు సమర్పించి తమ మొక్కలు చెల్లించుకోవడం జరుగుతుందన్నారు. శ్రీరామనవమి పండుగ సందర్భముగా శ్రీరామచంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులకు పానకము,వడపప్పు ప్రసాదము వితరణ చేయుట జరిగినది..ఆలయ ప్రాంగణం మొత్తము అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి..ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ,భక్తాదులందరూ పాల్గొన్నారు

---

### సీనియర్ నాయకుడు

## మల్లారెడ్డి మృతి పట్ల ప్రగాఢ సంతాపం



**పులివెందుల-సూర్య వాస్తవం :** మండలంలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మల్లారెడ్డి కన్నుమూశారు. ఆయన మృతి పట్ల పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ బోర్డు చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం మల్లారెడ్డి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూ రాలని భగవంతుని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### పాలీసెట్, ఏపీఆర్‌జేసీ ప్రవేశాలకు

## ఉచిత కోచింగ్ అడ్మిషన్‌లు ప్రారంభం





**పులివెందుల-సూర్య వాస్తవం:** స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం చే నిర్వహిస్తున్న ఉచిత శిక్షణా తరగతుల కు పట్టణం లోని పాత రమణప్ప సత్రం పాఠశాలలో శుక్రవారం అడ్మిషన్ లు ప్రారంభం అయినట్లు ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం తెలిపారు. ఈ ఏడాది 10 వ తరగతి పరీక్షలు రాసి పాలీసెట్, ఏపీ ఆర్ జేసీ ప్రవేశ పరీక్షలకు హాజరు అయ్యే గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయ బృందం వెంకటనారాయణ,రామ కృష్ణయ్య,క్రిష్ణారెడ్డి, మహేశ్వర్ రెడ్డి,అమర్ నాథ్ రెడ్డి, శ్రీదేవి, విజయానందన్ రెడ్డి,శివ గంగాధర్ రెడ్డి,రెడ్డి,స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు, సభ్యులు రాఘవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ అవినాష్ రెడ్డి దాతృత్వం

### - సాంప్రదాయాలను గౌరవిస్తూ

### రూ. 50 వేల నగదు అందజేత



**సింహాద్రిపురం-సూర్య వాస్తవం:** సాంప్రదాయాలను గౌరవిస్తూ 50 వేల రూపాయల నగదును జిల్లా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి గ్రామ ప్రజలకు అందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. వివరాలలోకి వెళితే ఏప్రిల్ 12వ తేదీ ఆదివారం అంకాలమ్మ గూడూరు లో జరుగుతున్న జాతర సందర్భంగా కడపనగయ్యపల్లె ప్రజలు సాంప్రదాయాలలో భాగంగా కుంకుమ రథం తీసుకురాగా వారిని గౌరవిస్తూ కడప పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి 50,000 రూపాయలు సింహాద్రిపురం వైకాపా మండల అధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి చేతుల మీదుగా గ్రామ ప్రజలకు ఆ డబ్బులను శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవి రెడ్డి శ్రీకాంత్ రెడ్డి మరియు కడప నాగయ్య పల్లె గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

### అమరావతి శాశ్వత రాజధానిగా చట్టబద్ధత ఇది

# ఐదు కోట్ల ఆంధ్రుల కల సాకారం

## - హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ



**శింగనమల-సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతికి పార్లమెంట్ ఉభయ సభల్లో చట్టబద్ధత లభించడం చారిత్రాత్మక నిర్ణయమని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఘనంగా హర్షం వ్యక్తం చేశారు. ఉదయం 11 గంటల 11 నిమిషాలకు ప్రారంభమైన ఈ దివ్య ముహూర్తం ఐదు కోట్ల ఆంధ్రుల గుండెల్లో కొత్త ఆశ రేపిందని ఆమె అన్నారు. అమరావతి పై ఇప్పుడు చట్ట ముద్ర పడింది ఇక ఆ రాజధానిని నుంచి ఒక్క ఇటుక కూడా ఎవరూ కదిలించలేరు. ప్రజల త్యాగంతో నిర్మించిన ఈ రాజధానికి ఎవరైనా నష్టం చేయాలని చూస్తే ప్రజలే సమాధానం చెప్తారు అని స్పష్టం చేశారు. ఇంతకాలం అమరావతి రైతులను మభ్యపెట్టి రాజధానిపై అప్రజాస్వామిక ప్రయోగాలు చేసిన మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి రావడం కలలో కూడా జరగదు. ప్రజలు ఇచ్చిన తీర్పు స్పష్టం అభివృద్ధి రాజధాని అమరావతి తప్ప మరొకటి కాదు అని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. అలాగే అమరావతిని శాశ్వత రాజధానిగా నిలబెట్టడానికి పోరాడిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, పాలనాపరమైన అంకిత భావాన్ని ఆమె ప్రశంసించారు. అమరావతి చట్టబద్ధత కోసం నిరంతరం శ్రమించిన ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విభజన బాధల నుండి ముందుకు వచ్చిన నవ్యాంధ్రకి అమరావతి అజరామరమైన గుర్తు ఇది కేవలం నగరం కాదు, ఆంధ్రుల ఆత్మగౌరవం అని ఎమ్మెల్యే శ్రావణి శ్రీ అన్నారు. ఇక ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథం స్పష్టమైంది. అమరావతి నుంచి ప్రపంచం వైపు అడుగులు వేయడానికి సమయం వచ్చేసింది. ప్రజల స్ఫూర్తితో రైతుల త్యాగంతో నిర్మితమవుతున్న ఈ రాజధాని శాశ్వతంగా నిలుస్తుంది అని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ తెలియజేశారు.

### సామాన్యుల పై మరో భారం

# పాల ధరలు భారీగా పెంపు, ఒకే సారి - కొత్త రేట్లు

**వేముల-సూర్య వాస్తవం:** సామాన్యుల పైన మరో భారం పడుతోంది. ఇప్పటికే యుద్ధం కారణంగా వంట గ్యాస్ ధరలు భారీగా పెరిగాయి. పెట్రో ఉత్పత్తుల కొరత నిత్యావసరాల పైన పడింది. అటు సిమెంట్. ఇనుము ధరలు పెరిగాయి. గ్యాస్ కష్టాలతో పలు హోటళ్లు ఆహార పదార్థాల ధరలు పెంచేసాయి. అటు వంట గ్యాస్ సరఫరాకు సమస్య లేదని చెబుతున్నా. బుకింగ్ డెలివరీ లో మాత్రం ఇబ్బందులు తప్పటం లేదు. ఇదే సమయంలో రెండు ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థలు పాల ధరలను పెంచాయి. కొత్త ధరలు ఈ రోజు నుంచి అమల్లోకి వచ్చాయి. వరుసగా పెరుగుతున్న ధరలతో సతమతం అవుతున్న సామాన్యుడి పైన మరో భారం పడింది. పాల ధరలు పెరిగాయి. విజయ, సంగం డెయిరీ పాల ప్యాకెట్ల ధరలు పెరిగాయి. లీటరు మీద రూ. 2 పెంచుతున్నట్లు కృష్ణా మిల్క్ యూనియన్ ప్రకటించింది. పాల ధరల పెంపుకు సంబంధించి కొన్ని రోజుల క్రితమే కృష్ణా మిల్క్ యూనియన్ సర్వ సభ్య సమావేశం నిర్వహించి.. నిర్ణయం తీసుకుంది. ఈమేరకు మార్కెట్ లో విజయ, సంగం డెయిరీ పాల ధరలు పెరిగాయి. పెరిగిన ధరలు నేటి నుంచే రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి రానుండగా కృష్ణ, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లో మాత్రం ఏప్రిల్ 4 నుంచి అమల్లోకి వస్తాయిని. అలానే నెలవారీ పాల కార్డు మీద పాలు కొనుగోలు చేసేవారికి కూడా ఏప్రిల్ 9 వరకు పాత ధరలే అమల్లో ఉంటాయని ఆ తర్వాత నుంచి కొత్త ధరలు వర్తిస్తాయని కృష్ణా మిల్క్ యూనియన్ ప్రకటించింది. పాల సేకరణ, ప్యాకింగ్ సామగ్రి, ఇతరాత్ర ఖర్చులు పెరిగాయని. అందుకే పాల ధరను పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.



**పెరిగిన ధరలు.. అమలు ఇలా:**

తాజా నిర్ణయం మేరకు ప్రస్తుతం ఉన్న ధరకు లీటరు మీదర రూ. 2, అర లీటర్ పాలకు రూ. 1 చొప్పున పెంచినట్లు వెల్లడించారు. స్టాండర్డ్ పాల ధర రూ. 62 నుంచి 64, టోన్డ్ పాల ధర రూ. 58 నుంచి 60, డబుల్ టోన్డ్ రూ. 54 నుంచి 56 పెంచారు. అలాగే హోమోజినైజ్డ్ ఫుల్ క్రీమ్ మిల్క్ లీటరు రూ. 68 నుంచి 72, టీ మేట్ రూ. 68 నుంచి 70 పెరగనుంది. ఆవుపాలు లీటరు రూ. 54 నుంచి 56, టోన్డ్ మిల్క్ పెరుగు ప్యాకెట్(450 గ్రాములు) రూ. 32 నుంచి 33 పెంచారు. సంగం డెయిరీ పాల సేకరణ ధరను పెంచింది. గుంటూరు జిల్లాలో గేదె పాలకు రూ. 840 కిలో వెన్నకు, ఆవుపాలకు రూ. 310 కిలో ఘన పదార్థాలకు చెల్లించనున్నట్టు వెల్లడించారు. ఉభయ గోదావరి జిల్లాల్లో గేదె పాలకు రూ. 830, ఆవుపాలకు రూ. 301. నెల్లూరు జిల్లాలో గేదె పాలకు రూ. 820, ఆవుపాలకు రూ. 301, ప్రకాశం జిల్లాలో కేంద్రాలు, డెయిరీ ఫారాల వారికి గేదె పాలకు రూ. 840, వెండార్ పాయింట్లకు రూ. 820, ఆవుపాలకు రూ. 310 కిలో ఘన పదార్థాలకు చెల్లించనున్నట్టు పేర్కొన్నారు.

# అమరావతికి చట్టభద్దత లభించడంతో బైక్ ర్యాలీ

**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి ఆంధ్రుల కలల రాజధాని అమరావతి కి చట్టభద్దత లభించిన సందర్భంగా గుంతకల్లు శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు యువనేత గుత్తి మరి యు పామిడి టీడీపీ ఇంచార్జ్ గు మ్మనూరు ఈశ్వర్ గుత్తి పట్టణం నందు ఒకే రాష్ట్రం ఒకే రాజధాని అమరావతి కార్యక్రమం నిర్వహించి కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సంద ర్భంగా గుమ్మనూరు ఈశ్వర్ కి గుత్తి నేతలు ఘన స్వాగతం పలికారు, అనంతరం గుమ్మనూరు ఈశ్వర్ స్థానిక గాంధీ సర్కిల్ నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు భారీ ఎత్తున బైక్ ర్యా లీ నిర్వహించడం జరిగింది. ఈ సం దర్భంగా గుమ్మనూరు ఈశ్వర్ విలే కరుల సమావేశం నిర్వహించి మా ట్లాడుతూ నారా చంద్రబాబు నా యుడు ఎంతో విజినరి తో ఆలో చించి దేవతల రాజధాని అమరా వతి పేరు తీసుకొని మన అమరా వతి రాజధాని చేయాలని సంకల్పం తో 2015 లో శంకుస్థాపన చేయడం జరిగింది. కానీ జగన్ మోహన్ రెడ్డి అ ధికారం లోకి వచ్చాక 3 రాజధాను లు కడతాను అని చెప్పి అసలు మ నకు రాజధాని లేకుండా చేసారని పక్క రాష్ట్రము వాళ్ళు మీ రాజధాని ఏదని ఎగతాళి చేసే పరిస్థితి వచ్చిం దని వాపోయారు. మన చంద్రబాబు మళ్ళీ ముఖ్యమంత్రి గా రావడం మళ్ళీ మన అమరావతి రాజధాని గా చేయాలని పనులు మొదలు పెట్ట డం అన్నీ చక చక జరిగాయి, మొన్ననే అమరావతి కి చట్టభద్దత లభించడం చాలా సంతోషం అని ఇక అమరావతి ఒక చరిత్ర అని ముందు ముందు రాబోయే కాలం అంతా మంచే జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుత్తి పట్టణ, మండల కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





### కనేకల్‌లో చిక్కనేశ్వర మహారథోత్సవం

## పంచాయతీ ఆధ్వర్యంలో

# పూలమాలల ఘన సమర్పణ

**కనేకల్-సూర్య వాస్తవం:** చిక్కనేశ్వర స్వామి మహారథోత్సవం సందర్భంగా కనేకల్ మేజర్ పంచాయతీ ఆధ్వర్యంలో పూలమాలల సమర్పణ కార్యక్రమం ఘనంగా జరిగింది. భక్తిశ్రద్ధలతో సిద్ధం చేసిన పూలమాలను పంచాయతీ కార్యాలయం నుండి మేళతాళాల నడుమ ట్రాక్టర్లలో ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి అందజేశారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ఈ ఊరేగింపులో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొనిస్వామివారి నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. రథోత్సవం సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసి, పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు చిన్న సర్మాస్, మాజీ వార్డ్ సభ్యుడు బుషప్పతో పాటు ఎంపీడీవో విజయసింహారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో చంద్రమౌళి, జూనియర్ అసిస్టెంట్ మారుతి ప్రసాద్, బిల్ కలెక్టర్లు తిరుపాల్, ఇబ్రహీం అలీ, వరదరాజులు, మేస్త్రి, కంప్యూటర్ ఆపరేటర్ వినోద్, వాటర్ బాయ్స్ అల్తాఫ్, సికిందర్, జగదీష్ మరియు మల్లికార్జున పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. పంచాయతీ అధికారులు మాట్లాడుతూ, గ్రామంలో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సామాజిక ఐక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. రథోత్సవం విజయవంతంగా నిర్వహించడంలో ప్రజల సహకారంఅభినందనీయమని పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే మా ధ్యేయం




**పులివెందుల-సూర్య వాస్తవ:** పులివెందుల నియోజకవర్గం రైతు సమస్యలపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవితో చరవాణి ద్వారా మాట్లాడుతున్న పులివెందుల నియోజకవర్గ ఇన్చార్జి బీటెక్ రవి అందరూ అరటిపంట వైపు మొగ్గుచూపుతున్నారు. ఎక్కువగా ఇక్కడ అరటిపండు పండిస్తున్నారు., విద్యుత్ సంబంధించిన పరికరాలు తక్కువగా ఉన్నాయి సకాలంలో వారికి విద్యుత్ సరఫరా మనం అందించగలిగితే పంటలు బాగా పండి రైతే రాజు అవుతాడు ,మన ప్రభుత్వంలో రైతులకు ఇప్పటికే పెద్ద పీట వేస్తున్నా పులివెందుల నియోజకవర్గం విద్యుత్ సమస్యలను వెంటనే తీర్చాలని మనవి చేసుకుంటున్నా. వెంటనే స్పందించిన మంత్రి సమస్య ఏదైనా కూడా త్వరలో పరిష్కరిస్తాం సంబంధిత అధికారితో మాట్లాడి వెంటనే పులివెందుల నియోజకవర్గం విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని విద్యుత్ పరికరాలను వెంటనే కొనుగోలు చేసే విధంగా సంబంధిత అధికారులను ఆదేశిస్తాం వెంటనే మీరు కూడా వారితో టచ్ లో ఉండి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేయండి... నేను ఇప్పుడే సంబంధిత అధికారులతో మాట్లాడతా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి. సమస్య ఉందని వెంటనే తెలుసుకొని సంబంధించిన శాఖ మంత్రితో వెంటనే ఫోన్లో మాట్లాడి బీటెక్ రవి పరిష్కరించడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేశారు.

## దివ్యాంగులకు ఓంశాంతి సంస్థ బ్యాగుల వితరణ

**పులివెందుల-సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణం ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో ఏర్పాటుచేసిన ఒక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఓం శాంతి సేవకులు రాధిక, శంభు రెడ్డి, రాజేశ్వరి తదితరులు రాజయోగము, ధ్యానం చేయించి దివ్యాంగులకు స్వస్థత కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఓం శాంతి తరఫున 30 మంది దివ్యాంగులకు బ్యాగులు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వికలాంగులకు చేయూతనందించిన పులివెందుల ఓంశాంతి సంస్థ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఓంశాంతి సంస్థ నిర్వాహకులు రాధిక సిస్టర్, రాజేశ్వరి సిస్టర్, విశ్రాంత ఎంఈఓ శంభురెడ్డి, కార్యవర్గ సభ్యులు గంగనపల్లి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. లి

### గుత్తి పీఎస్ పరిధిలో

## బ్లాక్ స్పాట్ ప్రాంతాలను సంద ర్శించి పోలీసులు





**గుత్తి-సూర్య వాస్తవం:** గుత్తి అనంతపురం జిల్లా ఎస్పీ పి.జ గదీష్ ఐపీస్ ఆదేశాల మేరకు గుంత కల్ డీఎస్పీ ఏ.శ్రీనివాస్, ఆధ్వర్యంలో గుత్తి సి.ఐ రామారావు, గుంతకల్ ఎంవీఐ మరియు సంబంధిత అసి స్టెంట్ ఇంజనీర్లు కలిసి గుత్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదా రులు ఎన్‌ఎచ్-44, ఎన్‌ఎచ్-67 మ రియు రాష్ట్ర రహదారులపై గుర్తించి న 6 బ్లాక్ స్పాట్లను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రమాదా ల నియంత్రణకు అవసరమైన భద్ర తా చర్యలు, హెచ్చరిక బోర్డుల ఏర్పా టు, రోడ్డు మరమ్మతులు మరియు ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. ప్రమాదాలు అధికం గా నమోదవుతున్న ప్రాంతాల్లో త క్షణ చర్యలు తీసుకోవాలని సంబం ధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజల ప్రాణ భద్రత కోసం వాహనదారులు ట్రాఫిక్ నియమాల ను తప్పనిసరిగా పాటించాలని, జా గ్రత్తగా వాహనాలు నడపాలని పో లీసు అధికారులు విజ్ఞప్తి చే శారు.

## లక్కిరెడ్డిపల్లి గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారుల నియామకం

**లక్కిరెడ్డిపల్లి-సూర్య వాస్తవం:** లక్కిరెడ్డిపల్లి మండల పరిధిలోని 16 గ్రామపంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు ఎంపీడీవో రెడ్డయ్య తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ నుంచి ఉత్తర్వులు తమకు అందాయని పేర్కొన్నారు. కోనంపేట లక్కిరెడ్డిపల్లె గ్రామపంచాయతీలకు ఎంపీడీవో రెడ్డయ్య, పందిళ్ళపల్లి రెడ్డివారిపల్లెకు డిప్యూటీ ఎంపీడీవో ఉషారాణి, అనంతపురం, చౌటపల్లికి పశు వైద్య అధికారి ఎం మహేష్, కస్తూరి రాజు గారి పల్లి, అప్ప కొండయ్య గారి పల్లి గ్రామపంచాయతీలకు డిప్యూటీ ఎంపీడీవో నాగేంద్ర వరప్రసాద్ బాబు ను నియమించామన్నారు. అలానే కుర్నూతలకు వ్యవసాయ అధికారి రాజకుమారిని, దప్పేపల్లి, మద్దిరేవులకు ఎంఈఓ-2 చక్రే నాయక్ ను, దీన్నేపాడు కు ఆర్టికల్చర్ అధికారి సింధూరిని, బి ఎర్రగుడి పాలెం గొల్లపల్లెకు తహసిల్దార్ క్రాంతి కుమార్ ను, బూడిదగుంట పల్లె, కాకులవరం లకు ఎంఈఓ 2 వెంకటసుబ్బయ్య ను నియమించినట్లు ఆయన వివరించారు. ఈరోజు నుంచి వారి పరిపాలనలో గ్రామపంచాయతీ నిర్వహణ జరుగుతుందని తెలిపారు.

# అమరావతి చట్టబద్ధత బిల్లు కు మద్దతు.

## ఆమ్ఆద్మీపార్టీ

**వేంపల్లె-సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి రాజసభలో ఆమోదముద్ర వేయడం హర్షణీయమని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ రహమతుల్లా జిల్లా ఉపాధ్యక్షులు దాదా పీర్ లు తెలిపారు.ఇందుకు తమ ఆమ్ఆద్మీపార్టీ జాతీయ నాయకత్వం అరవింద్ కేజ్రీవాల్ నిర్ణయం మేరకు రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యులు సంజయ్ సింగ్ ఈబిల్లుకు మద్దతు ఇవ్వడంజరిగింది. అమరావతి రాజధానినీ ఆమోదించినట్టు తెలిపారు. ఈసందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ ఆంధ్రప్రదేశ్ తరపున రాష్ట్ర కన్వీనర్ రమేష్ కుమార్ నాయుడు నాయకత్వం కూడా హర్షణీయం వ్యక్తం చేస్తూ అన్ని జిల్లాల ఆప్ కన్వీనర్లు హర్షినియం వ్యక్తం చేయాలని పిలుపుచ్చారు ఇందులో భాగంగా కడప జిల్లా ఆప్ తరుపున పులివెందుల నియోజకవర్గంలోని వేంపల్లి విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది మరియు రాజధాని అంటే తాత్కాలిక కట్టడాలు కట్టి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయకుండా శాశ్వత కట్టడాలు కట్టి భారత దేశంలో ఏ రాష్టశీలేని రీతిలో రాజధాని అమరావతిని నిర్మించాలని




ఇందులో భాగంగా నే మిగిలిన అన్ని జిల్లానూ అభివృద్ధి పరిచే దిశగా ముందడుగు వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా ఆమ్ఆద్మీపార్టీగా కోరుతున్నామన్నారు అంతేకా కుండా కేంద్ర బిజెపి నాయకత్వం ఎప్పుడు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందో ఇదివరకు బీజేపీ తో కూటమి ప్రభుత్వాలు కూలిపోయిన అంశాలు చాలానే చూశాము కాబట్టి కాస్త జాగ్రత్తలు వహించి రాష్ట్రానికి రావాల్సిన అన్ని వనరులను పురోగతిన రాబట్టుకొని రాష్ట్ర నిర్మాణం పూర్తి చేయాలనీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్తు పట్ల ఆలోచన చేసి ముందుగానే ఆమ్ ఆద్మీ పార్టీ తరపున సూచనలు ఇస్తున్నామంటూ రహంతుల్లా దాదా పీర్ ప్రభుత్వానికి సూచనలు ఇచ్చారు.

## దళితుల మీద దాడి చేసిన వారిపై

# చర్యలు తీసుకోవాలి

### డప్పు కొడుతున్న దళితుడి పై

### చేయి చేసుకున్న అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు



**పులివెందుల-సూర్య వాస్తవం:** నర్సీపట్నం పండగలో ఉత్సాహంగా డప్పు కొడుతున్న దళితుల్ని బూతులు తిడుతూ.. పోలీసుల సమక్షంలోనే భాస్కర్ రావు చెంపపై కొట్టిన అయ్యన్న పాత్రుడి మీద ఎస్ సి, ఎస్ టి కేసు బుక్ చేసి స్పీకర్ పదవి నుండి బహిష్కరించి క్షమాపణ చెప్పాలనిపులివెందుల తాలూకా దివ్యాంగుల అధ్యక్షులు చాలేటి భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూదళితుల మీద దాడి చేయడం పనికిమాలిన చర్య ఒక గౌరవ ప్రధమమైన పదవిలో ఉండి ఇలాంటి దాడులుచేయడం ఈ కూటమి ప్రభుత్వానికి అలవాటుగా మారింది దళితులు అంటే చిన్న చూపా ఉదాహరణకు చిలకలూరిపేట నియోజకవర్గం తుబాడు తన స్వగ్రామంలో వైయస్సార్సీపి, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు టి జేఆర్ సుధాకర్ బాబు తల్లి అన్నమ్మ ద్వితీయ వర్ధంతిలో కూటమి ప్రభుత్వం పోలీస్ లను పంపించి అడ్డుకోవడం హేయమైన చర్య దళితులు వర్ధంతులు జయంతులు జరుపుకోకూడదా ఈ రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుంది పోలీస్ వ్యవస్థ పొలిటికల్ సెర్వెంట్లు కాదు ప్రజల సర్వేంట్లు ఒక పార్టీ కి కొమ్ము కాయడం సమంజసం కాదు అని వైఎస్ఆర్సిపి రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీ కాళ్ళభాస్కర్ మరియు జిల్లా సెక్రటరీ ఆర్ కృష్ణమూర్తి పులివెందుల నియోజక వర్గ అధ్యక్షులు అగ్రహారం రవి మరియు వైయస్సార్సీపి పులివెందుల తాలూకా దివ్యాంగుల అధ్యక్షులు చాలేటి భాస్కర్ డిమాండ్ చేశారు అవసరమైతే భారీగా నిరసన ర్యాలీ చేసి కూటమి ప్రభుత్వాన్ని ఎండగడతాం అని హితువు పలికారు.

## రామసుబ్బారెడ్డి కృషి అభినందనీయం

### వీడ్కోలు కార్యక్రమంలో ఎమ్మెల్సీ రామ్ గోపాల్ రెడ్డి





**పులివెందుల-సూర్య వాస్తవం:** సింహాద్రిపురం మండల కేంద్రంలోని మోడల్ ప్రైమరీ స్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నాగిరెడ్డి రామసుబ్బారెడ్డి శుక్రవారం నాడు 42 ఏళ్ల సుదీర్ఘ విద్యా సేవ అనంతరం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పులివెందుల పట్టణం, విజయ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమానికి శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి, రామసుబ్బారెడ్డి ని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "నాలుగు దశాబ్దాల పాటు విరామం లేకుండా భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో రామసుబ్బారెడ్డి చేసిన కృషి ఎంతో అభినందనీయం. ఆయన నిబద్ధత యువ ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకం" అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి మరియు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## వైన్ షాపులపై తనిఖీలు

### సీఐ. నరసింహులు

**వేంపల్లె-సూర్య వాస్తవం:** కడప జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వేంపల్లె పరిధిలోని వైన్ షాపులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు సీఐ. నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి వైన్ షాపులో సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి పనితీరును పరిశీలించినట్లు సి ఐ చెప్పారు. షాపు నిర్వాహకులకు సూచనలు చేస్తూ, సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, రికార్డింగ్ డేటా భద్రపరచడానికి తగిన బ్యాకప్ సౌకర్యాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. భద్రతా ప్రమాణాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. తనిఖీల అనంతరం అవసరమైన మార్పులు చేయించామని, అన్ని వైన్ షాపుల్లో భద్రతా చర్యలను కట్టుదిట్టం చేసినట్లు సీఐ.నరసింహులు తెలిపారు.



## ఏసుక్రీస్తు మార్గంలో దయా ప్రేమతో జీవించాలి

### -ఫాదర్ జోసఫ్ రాజు



**కడప-సూర్య వాస్తవం:** ప్రభువైన ఏసుక్రీస్తు లోక రక్షణకై సిలువ దారియై నిలిచారని పాత కడప ఆర్.సి.యం చర్చి ఫాదర్ జోసఫ్ రాజు తెలిపారు. శుక్రవారం పాత కడప ఆర్సీఎం చర్చి వద్ద ఫాదర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏసుక్రీస్తు పాపుల కొరకు సిలువ దారియై నిలిచి, తన రక్తంతో పాపులను పునీతులుగా చేయడానికి ఎన్నో శ్రమలు అనుభవించారని పేర్కొన్నారు. ఆయన తలకు ముళ్ల కిరీటం ధరించి మన కోసం బాధలను భరించిన త్యాగాన్ని స్మరించుకోవాలని తెలిపారు. క్రీస్తు యేసు చూపిన శాంతి, దయ, కరుణ, ప్రేమ మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని ఆయన క్రైస్తవులను ఉద్దేశించి పిలుపునిచ్చారు. అనంతరం పాత కడప పురవీధుల గుండా యువకులు ఏసు సిలువ మార్గాన్ని బొమ్మల వేషధారణలతో నాటక రూపంలో ప్రజలకు కన్నుల పండువగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరీ సోదరులు భక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో సీపీ రమణ, చర్చి కమిటీ సభ్యులు రవి, ఆనంద్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

### మానవాళి కోసం

## క్రీస్తు ప్రభువు చేసిన త్యాగమే గుడ్ ఫ్రైడే





**లక్కిరెడ్డిపల్లి-సూర్య వాస్తవం:** క్రీస్తు శ్రమల పాటు పండుగను పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని సెయింట్ జోసెఫ్ క్యాథలిక్ చర్చి, లూథరన్ చర్చి, మిస్పా చర్చి మద్దిరేవుల చర్చిలలో గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు.మండల కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ క్యాథలిక్ చర్చిలో రెవరెండ్ ఫాదర్ విజయ మోహన్ రెడ్డి ఏసుక్రీస్తు జీవిత చరిత్ర, ఆయన ప్రజల కోసం సిలువ మోసిన త్యాగం గురించి వివరించారు. ఈ నెల అంతా ఉపవాసాలు చేసిన క్రైస్తవ సోదరులు ఈ రోజుటితో ప్రార్థనలు చేసి ఉపవాసాలు వదులుతారు. ఈ సందర్భంగా రెవరెండ్ ఫాదర్ విజయ మోహన్ రెడ్డి సిలువును మోసి సిలువ మార్గాన్ని ప్రారంభించారు. అనంతరం కరుణామయుడైన యేసు ప్రభువు జీవితం త్యాగానికి చిహ్నమని, మానవాళి పట్ల ప్రేమ, శత్రువులపై కనికరం నిస్సహాయుల పట్ల కరుణ, దయ, క్రీస్తు ప్రభువు చేసిన త్యాగమే గుడ్ ఫ్రైడే అని ఆయన క్రైస్తవ విశ్వాసులకు భక్తులకు ప్రభువు సందేశం, శాంతి మార్గాల గురించి వివరించారు. అనంతరం పేరుపేరునా ప్రార్థనలు చేసి ఉపవాసం ఉన్న క్రైస్తవ విశ్వాసులకు మరియు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ ఆనంద్, రామాపురం విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ చిన్నప్ప పెద్ద సంఖ్యలో కథోలిక విశ్వాసులు భక్తులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఆఫీసర్ పాలనలో గ్రామ పంచాయతీలు

**సూర్య వాస్తవం- చెన్నూరు:** మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగునుంది. ఇకనుండి ప్రజా సమస్యల పరిష్కారం అభివృద్ధి కార్యక్రమాల అమలు బాధ్యతలను స్పెషల్ ఆఫీసర్లు స్వీకరించనున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మండలం లోని ప్రతి పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. ఇందులో చెన్నూరుకు డి ఎల్ పి ఓ ను, బయనపల్లికు ఎంపీడీవోను, రామనపల్లెకు తాహాశిల్దార్ ను, గుర్రం పాడు కు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ ను, బలసింగాయ పల్లెకు, కొక్కరాయపల్లెకు మండల విద్యాశాఖ అధికారి 2ను, ఉప్పరపల్లె, రాచినాయపల్లెకు మండల అగ్రికల్చర్ అధికారిని, శివాల పల్లె ముండ్లపల్లె కు డిప్యూటీ ఎంపీడీవో ను, నియమించడం జరిగింది. గ్రామపంచాయతీలో ఎన్నికలు లేకపోవడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు స్పెషల్ ఆఫీసర్లను నియమించి పాలన సాగించడం జరుగుతుంది. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు సంక్షేమ పథకాల అమలుపై స్పెషల్ ఆఫీసర్లు ప్రత్యేక దృష్టి సారించనున్నారు.



# రాకాస రివ్యూ.. ఎలా ఉందంటే .. ?



హైదరాబాద్ బ్యూరో : నిహారిక కొణిదెల నిర్మాణంలో మానస శర్మ ను దర్శకురాలిగా పరిచయం చేస్తూ తీసిన సినిమా రాకాస. సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు.. టీజర్, ట్రైలర్ లతో హర్రర్ సినిమా అని చెప్పేశారు. మరి ఈరోజే విడుదలైన ఈ సినిమా ఎలా వుందో చూద్దాం.

తారాగణం ...

సంగీత్ శోభన్, నయన్ సారిక, వెన్నెల కిషోర్, తనికెళ్ళ భరణి, బ్రహ్మాజీ, గెటప్ శ్రీను, బ్రహ్మాజీ, ఆశిష్ విద్యార్థి, మానస శర్మ. తదితరులు

సాంకేతికత : ఛాయాగ్రహణం : ఎదురోలు రాజు, సంగీతం : అనుదీప్ దేవ్, నిర్మాతలు: నిహారిక కొణిదెల, ఉమేష్ కుమార్ బన్సల్, కూర్పు : అన్వర్ అలీ, దర్శకత్వం : మానస శర్మ.

కథ ఏమిటంటే ....

ఓ ఊరిలో రాజుల కాలంనుంచి జరిగిన కథ ఇది. 2 వేల సంవత్సరాలనుంచి ఆ ఊరిలోని కోటలో ఓ బ్రహ్మ రాక్షసుడు ఇచ్చిన సంకేతాల ప్రకారం ఊరి నుంచి ఒకరు రాక్షసుడికి బలిగా పంపుతూ వుంటారు. అలా 2026 నాటికి కథ వస్తుంది. అదే ఊరిలో పుట్టి పెరిగిన వీరబాబు (సంగీత్ శోభన్) విదేశాలకు వెళ్ళి సంపాదించుకుని తను ప్రేమించిన అమ్మాయిని పెండ్లిచేసుకోవాలని వస్తాడు. తీరా వచ్చాక మరొకరితో పెండ్లిచేసుకుంటుందని తెలిసి షాక్ కు గురవడమేకాకుండా ఎలాగైనా ఆ అమ్మాయిని పెళ్లి చేసుకోవాలని ట్రై చేస్తాడు. ఆ క్రమంలో ఊరిలోనే చిన్ననాటి స్నేహితురాలు ఊరి ఆచారి కూతురు నయన్ సారిక ప్రేమకు దగ్గరవుతాడు. ఇదిలా వుండగా .... ఊరి కోటలో వున్న రాక్షసుడికి బలిగా వీరబాబు స్నేహితుడు గెటప్ శీను వంతు వస్తుంది. ఊరి పెద్ద పంచాయితీ తీర్పును వ్యతిరేకించి ఇదంతా మూఢనమ్మకమని దాన్ని ఛేదించేందుకు తనే వెళతానని మాటజారతాడు. అలా వీరబాబు కోటలోకి ప్రవేశించాల్సివస్తుంది. ఇక ఆ తర్వాత కోటలో జరిగే వింతలు విశేషాలే మిగిలిన సినిమా.

సమీక్ష ....

ఓ ఊరు. కట్టుబాట్లు, దెయ్యం ఇలాంటి కథలు చాలా వచ్చాయి. రాక్షసుడు అనే కాన్సెప్ట్ తో రాకాస సినిమాగా రూపొందింది. అయితే ఎక్కడా పాత సినిమా ఛాయలు కనిపించకుండా నిహారిక మనసుపెట్టి విన్న కథను అంతే మనసుపెట్టి మానశ శర్మ తీసిందనే చెప్పాలి. కథ ఆద్యంతం ఎంటర్ టైన్ మెంట్ తో థ్రిల్, హర్రర్ అంశాలతో లాజిక్ గా తీయడం విశేషం. దర్శకురాలు కామెడీని, థ్రిల్లింగ్ మూమెంట్స్ ని మిక్స్ చేసిన విధానం బావుంది

చిత్రంలోని ప్రధాన పాత్ర సంగీత్ శోభన్ భుజాన మోశాడనే చెప్పాలి. అమాయకత్వంతోపాటు వాగుడుకాయలా వాగుతూ వుండడం కూడా నవ్వు తెప్పిస్తుంది. తన స్పీడ్ డైలాగ్ లకు అనుగుణంగా హావభావాలు పలికిస్తూ ఎక్కడా బోర్ లేకుండా చేశాడు. దానికితోడు కామెడీ టైమింగ్ తో మరోసారి ఆకట్టుకున్నాడు. తనకు బావ.. అంటూ తోడుగా వుండే గెటప్ శీను పాత్ర ఆకట్టుకుంది. సెకండాఫ్ లో వెన్నెలకిశోర్ తో కోటలో సాగే సన్నివేశాలు మరింత ఆకట్టుకునేలా వుంటాయి. వెరసి హాయిగా నవ్వుకునే క్లీన్ కామెడీ సినిమాగా వుంది.

ఇక మిగిలిన పాత్రలు తనికెళ్ళభరణి, ఆవిష్ విద్యార్థి, బ్రహ్మాజీ పాత్రలు పరిధి మేరకు వున్నాయి. రాక్షసుడిగా నటించిన నటుడు ఆహార్యానికి తగినట్లుగా వున్నాడు. కథానాయిక నయన్ తో సాగే సన్నివేశాలు కూడా అలరిస్తాయి. చివరిలో చిన్న ట్విస్ట్ కూడా థ్రిల్ కలిగిస్తుంది.

సాంకేతికంగా చూస్తే, రాజకోట కూడా పాత్రగానే పరిగణించాలి. ఆర్ట్ డిపార్ట్ మెంట్ తీరు బాగుంది. సినిమాటోగ్రఫీ, నేపథ్య సంగీతం కథలో భాగంగా వున్నాయి. ప్రొడక్షన్ డిజైన్ కానీ విజువల్ ఎఫెక్ట్స్ ఇంకా ఆర్ట్ వర్క్ మాత్రం చాలా బాగా డిజైన్ చేసుకున్నారు.

ఇక ఇలాంటి ఫాంటసీ టచ్ ఉన్న సబ్జెక్ట్ లో రాక్షసుడిలోని మానవ కోణం కూడా చూపిస్తూ దర్శకురాలు చేసిన ప్రయత్నం మెచ్చదగిందే. అయితే ఆ క్రమంలో చిన్నపాటు లోటుపాట్లు వున్నా అవేవి పెద్దగా కనిపించకుండా తను జాగ్రత్త పడిందనే చెప్పాలి. ప్రేక్షకులను భయపెట్టి, కాసేపు ఎంటర్ టైన్ చేసే కోణంలో ఈ చిత్రం తీశారనే చెప్పారు. వేసవిలో కుటుంబం అంతా కలిసి చూసే సినిమాగా రూపొందిన ఈ సినిమాకు నిహారిక ప్రొడక్షన్ వేల్యూస్ బావున్నాయి. గ్రాండ్ లెవల్ లో సినిమా ప్రొడ్యూస్ చేశారు. అయితే పబ్లిసిటీ సాంగ్ గా చివరిలో వచ్చిన పాటను కథనంలో మధ్యలో డ్రీమ్ సాంగ్ గానో పెడితే ప్రేక్షకులు కాసేపు ఆటవిడుపుగా అనిపించేది. అన్వర్ అలీ ఎడిటింగ్ కూడా ఓకే కానీ కొన్ని సీన్స్ లో మాత్రం అక్కడక్కడా ఫ్రేమ్స్ మిస్ మ్యాచ్ అయినట్టు కనిపిస్తుంది.

ఫైనల్ గా చెప్పాలంటే, వినోదంతోపాటు భయాన్ని కలిగిస్తూ ప్రేక్షకులను అలరించే చిత్రంగా చెప్పవచ్చు. దర్శకురాలిగా తన ప్రతిభను చూపించడానికి ఈ సినిమా బాగా ఉపయోగపడింది. ఎక్కడా వల్గారిటీ లేకుండా తీయడం విశేషం.

## తుది కసరత్తుల్లో 'పెద్ది'



కథానాయకుడు రామ్‌చరణ్, కథానాయికగా జాన్వీకపూర్ నటించిన సినిమా 'పెద్ది'. నిర్మాణా నంతర కార్యక్రమాలను పూర్తి చేసుకుంటోంది. ఈనెల 30న థియేటర్లలో విడుదల చేస్తామని చిత్ర యూనిట్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా మార్చి 27నే విడుదల కావాల్సివుంది. విఎఫ్ఎక్స్ పనుల పెండింగ్‌తో వాయిదా పడింది. చెల్లి నిహారిక కొణిదెల నిర్మాతగా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌లో నిర్మించిన 'రాకాస' మూవీ చిత్ర యూనిట్‌తో కలిసిన సందర్భంలో రామ్‌చరణ్ మాట్లాడారు. "పెద్ది' వాయిదా అని చాలా మంది అనుకుంటున్నారు, అలాంటిదేమీ లేదు.. ఏప్రిల్ 30నే థియేటర్లలోకి వస్తున్నాం' అంటూ వ్యాఖ్యా నించారు. అఖిల్ అక్కినేని నటిస్తున్న 'లెనిన్?' మూవీ కూడా వాస్తవంగా ఏప్రిల్ ఆఖరిలోనే విడుదల చేయాలి. పెద్దిని దృష్టిలో పెట్టుకుని ఆ చిత్ర యూనిట్ జూన్‌కు విడుదల తేదీని మార్చింది. నాని 'ది ప్యారడైజ్?' కూడా ఏప్రిల్‌లో విడుదల చేయాలనే ఆలోచనలో ఆ చిత్ర యూనిట్ ఉంది. పెద్దితో అదీ వాయిదా పడింది. ఉగాదికి వచ్చిన పవన్‌కళ్యాణ్ సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్' డిజాస్టర్‌గా మిగిలింది. తాజాగా పెద్ది మళ్లీ వాయిదా అంటూ ఊహాగానాలు చక్కెర్లు కొడుతున్నాయి. పెద్ది వాయిదా పడితే మే 1న 'లెనిన్' మూవీ వస్తుందనీ, లేకుంటే జూన్‌కు వెళ్తామని ఆ చిత్ర యూనిట్ ఇటీవల ప్రకటించింది.





# శ్రేయస్, ప్రభ్ సిమ్రన్ మెరుపులు

### - పంజాబ్ ఖాతాలో మరో గెలుపు
### - మళ్లీ ఓడిన చెన్నై

చెన్నై: పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కి తోడు ప్రభ్ సిమ్రన్ సింగ్ రాణించడంతో చెన్నై సూపర్‌కింగ్స్ నిర్దేశించిన భారీ లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 209పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేయగా.. అనంతరం పంజాబ్ కింగ్స్ 18.4ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 210పరుగులు చేసి సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించింది. పంజాబ్ జట్టు కెప్టెన్ శ్రేయస్(50; 29బంతుల్లో 4ఫోర్లు, 3సిక్సర్లు), ప్రభ్ సిమ్రన్(43; 34బంతుల్లో 6ఫోర్లు, సిక్సర్)కి తోడు ప్రియాన్ష్ ఆర్యా(39), కూపర్ కనోలే(36) కూడా రాణించి తలో చేయి వేశారు. చెన్నై బౌలర్లు హెన్రీ, కంబోజ్ రెండేసి వికెట్లతో రాణించారు. అంతకుముందు చెన్నై ఓపెనర్ సంజూ శాంసన్(7) చెపాక్‌లోనూ నిరాశపరిచాడు. ఆ తర్వాత అండర్-19 కెప్టెన్ ఆయుష్ మాత్రే(73), చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్(28) కలిసి చెలరేగి ఆడారు. హ్యాట్రిక్ ఫోర్లతో.. కళాత్మక సిక్సర్లతో అలరించిన మాత్రే 29 బంతుల్లోనే అర్ధ శతకం సాధించాడు. రెండో వికెట్‌కు 55 బంతుల్లో 96 పరుగులు జోడించిన ఈ ద్వయాన్ని చాహల్ విడదీశాడు. మాత్రే ఔటయ్యాక క్రీజ్‌లోకి వచ్చిన కార్తీక్ శర్మ(1)ను యాన్సెన్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఆ తర్వాత సర్ఫరాజ్ ఖాన్(32) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. తొలి మ్యాచ్‌లో ఇంప్యాక్ట్ చూపలేకపోయిన అతడు ఈసారి టీ20 బ్యాటర్‌లా రెచ్చిపోయాడు. అర్ష్‌దీప్, విజరుకుమార్ ఓవర్లలో హ్యాట్రిక్ బౌండరీలతో అలరించారు. ప్రమాదకరంగా మారిన సర్ఫరాజ్‌ను షార్ట్ బంతితో విజరుకుమార్ బోల్తా కొట్టించాడు. శివం దూబే(45 నాటౌట్) తన స్టయిల్లో ఫోర్లు, సిక్సర్ల మోత మోగించాడు. అర్ష్‌దీప్ వేసిన చివరి ఓవర్లో దూబే మూడు ఫోర్లు కొట్టాడు. దీంతో చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి 5వికెట్ల నష్టానికి 209పరుగుల భారీస్కోర్ చేసింది. విజరుకుమార్ వ్యాషక్‌కు రెండు, చాహల్, యాన్సెన్, బార్ట్‌లెట్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు...

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: సంజు శాంసన్ (సి)ప్రభ్‌సిమ్రన్ సింగ్ (బి)బార్ట్‌లెట్ 7, గైక్వాడ్ (సి)వాధేరా (బి)చాహల్ 28, మాత్రే (సి)చాహల్ 9బి)వ్యాషక్ 73, దూబే (నాటౌట్) 43, కార్తీక్ శర్మ (ఎల్‌బి)యాన్సెన్ 1, సర్ఫరాజ్ ఖాన్ (సి)వాధేరా (బి)వ్యాషక్ 32, ప్రశాంత్ వీర్ (నాటౌట్) 6, అదనం 17. (20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 209పరుగులు. వికెట్ల పతనం: 1/14, 2/110, 3/123, 4//130, 5/168 బౌలింగ్: ఆర్ష్‌దీప్ 4-0-41-0, బార్ట్‌లెట్ 4-0-48-1, యాన్సెన్ 4-0-43-1, వ్యాషక్ 4-0- 38-2,చాహల్ 3-0-21-1,స్టొయినీస్ 1-0-17-0.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రియాన్ను ఆర్యా (బి)హెన్రీ 39, ప్రభ్ సిమ్రన్ సింగ్ (రనౌట్) సర్ఫరాజ్/రుతురాజ్ గైక్వాడ్ 43, కూపర్ కనోలే (సి)హెన్రీ (బి)కంబోజ్ 36, శ్రేయస్ అయ్యర్ (సి)రాహుల్ చాహర్ (బి)కంబోజ్ 50, నేహల్ వధేరా (సి)నూర్ అహ్మద్ (బి)హెన్రీ 10, శశాంక్ సింగ్(నాటౌట్) 14, స్టొయినీస్ (నాటౌట్) 9, అదనం 9. (18.4ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 210 పరుగులు. వికెట్ల పతనం: 1/61, 2/95, 3/127, 4/186, 5/186 బౌలింగ్: ఖలీల్ అహ్మద్ 3-0-28-0, హెన్రీ 4-0-54-2, కంబోజ్ 3.4-0-43-2, నూర్ అహ్మద్ 4-0-38-0, చాహర్ 4-0-46-0.

## సెమీస్‌కు నిఖత్, ప్రీతి, ప్రియ

### - ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్



**ఉలాన్‌బాతర్(మంగోలియా):** ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళా బాక్సర్లు సత్తా చాటారు. నిఖత్ జరీన్, ప్రియ, ప్రీతి పవార్ సెమీస్‌కు చేరి పతకాలు ఖాయం చేశారు. మంగోలియా వేదికగా జరుగుతున్న పోటీల్లో హైదరాబాద్ స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ 51కిలోల విభాగం క్వార్టర్‌ఫైనల్లో ఫిలిప్పీన్స్‌కు చెందిన షిలాన్ బాగ్యున్‌ను ఓడించింది. తొలి రౌండ్ నుంచి ప్రత్యర్థిపై పిడిగుద్దులతో విరుచుకుపడిన నిఖత్.. అదే ప్రదర్శనను చివరి రౌండ్ వరకు కొనసాగించింది. సెమీస్‌లో 2024 పారిస్ ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత, చైనాకు చెందిన వుయు-వూతో తలపడనుంది. ఇక 60కిలోల కేటగిరీలో ప్రియ 4-1పాయింట్ల తేడాతో చైనాకు చెందిన చెంగ్యూ-యంగ్‌ను చిత్తుచేసి సెమీస్‌కు చేరింది. సెమీస్‌లో మంగోలియాకు చెందిన నమున్‌తో తలపడనుంది. ఇక 54కిలోల కేటగిరీలో వరల్డ్ బాక్సింగ్ స్వర్ణ పతక విజేత ప్రీతి పవార్ 5-0పాయింట్ల తేడాతో మంగోలియాకు చెందిన ముంగుంటెసెట్‌సెంగ్‌ను చిత్తుగా ఓడించింది. సెమీస్‌లో ప్రీతి 2024 పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, కొరియాకు చెందిన ఇమ్ ఏజీతో తలపడనుంది.

# తమ్ముళ్లలో అసంతృప్తి



**నెల్లూరు–సూర్య వాస్తవం:** కూటమి ప్రభుత్వం ఏర్పడి 21 నెలలు అయిపోతుంది. పవర్‌లోకి వచ్చాం సరే..పదవుల మాటేమిటని తెలుగు తమ్ముళ్లు ఎదురు చూస్తూనే ఉన్నారు. నామినేటెడ్ పోస్ట్ అయినా, పార్టీ పదవి అయినా..పార్టీ కోసం పనిచేసిన వారికే ఇవ్వాలంటున్నారు. అయితే ఎన్నికలకు ముందు..ఆ తర్వాత వైసీపీతో సహా వివిధ పార్టీల నుంచి వచ్చి టీడీపీలో చేరిన లీడర్లకు..పదవులు దక్కుతుండటం. .తెలుగు తమ్ముళ్లకు ఏ మాత్రం మింగుడు పడటం లేదట. అసలే కూటమి పొత్తులో భాగంగా షేరింగ్‌లో పదవులు దక్కడం లేదన్న ఫీలింగ్‌లో ఉంటే..వలస నేతలను పెద్దపీట వేస్తుండటంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారట. తెలుగు భాషా పాఠాలుమరీ ముఖ్యంగా వైసీపీ లీడర్లకు పదవులు కట్టబెట్టడాన్ని ఏ మాత్రం జీర్ణించుకోలేక ..అధిష్ఠానంకు ఫిర్యాదులు చేస్తున్నారట. జంపింగ్‌లను నమ్మి పదవులు కట్టబెడితే పార్టీని ముంచేస్తారని చెబుతున్నారట. దీంతో పార్టీ, లోకల్‌గా నామినేటెడ్ పదవుల భర్తీలో టీడీపీ హైకమాండ్ ఒత్తిళ్లు ఫేస్ చేయాల్సి వస్తోందట. ఓవైపు సీనియర్లు..ఇంకోవైపు క్యాస్ట్ ఈక్వేషన్స్, మరోవైపు పార్టీ కోసం కష్టపడ్డోళ్లు, పార్టీని నమ్ముకుని వచ్చిన నేతలు ..ఇలా అందరికి పదవులు ఇవ్వడం ఇబ్బందిగానే ఉందట.టీడీపీ ఆవిర్భావ వేడుకల సందర్భంగా నిర్వహించిన సమావేశంలో.. ద్వితీయ శ్రేణి నాయకుల్లో ఉన్న అసంతృప్తి బయటపడిందని అంటున్నారు. ఎన్నికల తర్వాత వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన వారికి కీలక పదవులు ఇవ్వడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారట సైకిల్ పార్టీ నేతలు. పార్టీలో సంస్థాగతంగా పదిహేను ఏళ్ల నుంచి సేవ చేస్తున్నామని. .ఆస్తులను అమ్ముకుని కూడా పార్టీ కోసం ఖర్చు చేసిన నాయకులు ఉన్నారని, అలాంటి వారికి పదవులు ఇవ్వాలని సూచించారట. క్షేత్రస్థాయిలో పార్టీ జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు వంటి పదవులను వైసీపీ నుంచి వచ్చిన కొందరికి ఎమ్మెల్యేలు సిఫారసు చేయటంపై అసంతృప్తి వ్యక్తం చేశారట. తమ ఎమోషన్స్‌కు విలువ ఇవ్వకుండా పదవులు ఇచ్చేస్తే ఎలా అని క్వశ్చన్ చేసినట్లు తెలుస్తోంది.ఒకటి రెండు చోట్ల నుంచి పార్టీకి ఫిర్యాదులు కూడా అందాయట. ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులకు పార్టీపై ప్రేమ ఉంటుందా? లేక పదవులపైనే ప్రేమ ఉంటుందో అధిష్ఠానం ఆలోచించు కోవాలని కూడా సూచనలు చేశారట. పార్టీని నమ్ముకుని పార్టీ కోసం త్యాగాలు చేసిన వారికి పదవులు ఇవ్వాల్సిన అవసరం ఉందని తేల్చి చెప్పారట. అయితే ఎమ్మెల్యేల సిఫారసులకే పార్టీ అధిష్టానం ప్రాధాన్యం ఇవ్వడంతో సమస్య వచ్చి పడిందంటున్నారు. ఈ క్రమంలోనే కొన్ని పొరపాట్లు జరిగాయని అటు చంద్రబాబు, ఇటు లోకేశ్ అలర్ట్ అయినట్లు టాక్ నడుస్తోంది.ఇక నుంచి అలా జరగదు. మాది భరోసా అంటూ లీడర్లకు భరోసా ఇచ్చారట చంద్రబాబు, లోకేశ్. పార్టీ కోసం పని చేసేవాళ్లకే పదవులు ఇస్తామని, పార్టీ బలోపేతానికి కృషి చేసిన వాళ్లకే ప్రజాప్రతినిధులుగా అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు టీడీపీ అధినేత. కార్యకర్తలను దూరం పెట్టే నేతలను తాను దూరం పెడతానని తేల్చి చెప్పడం వెనుక కారణం అదేనంటున్నారు.

కష్టపడే కార్యకర్తలను, నేతలను గుర్తించే బాధ్యత లోకేశ్‌దేనని చెప్పారు. ఇక వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చే వలసదారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని లోకేశ్ హెచ్చరించడం కూడా ఇందులో భాగమేనంటున్నారు. క్యాడర్, లీడర్లే టీడీపీ భవిష్యత్ నాయకులన్న లోకేశ్..గ్రామ స్థాయి నాయకుడు బాగా పనిచేస్తే పొలిట్ బ్యూరోలో కూర్చో బెడుతామంటున్నారు. రాబోయే పొలిట్ బ్యూరోలో మీరు ఆ మార్పును చూడబోతున్నారని కూడా చెబుతున్నారు.మొత్తం మీద లీడర్ల నుంచి వచ్చిన సజీషన్స్‌ను విన్నాకే..వలస నేతలు..ఎస్పెషల్‌గా వైసీపీ నుంచి వచ్చిన లీడర్ల విషయంలో అలర్ట్‌గా ఉండాలని లోకేశ్ సూచించారని అంటున్నారు.

# హిందుత్వ ముద్ర కోసం భూమన ఆరాటం




**తిరుపతి–సూర్య వాస్తవం::** ఆధ్యాత్మిక నగరి తిరుపతి రాజకీయాలు ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటాయి. అయితే, గత కొంతకాలంగా వైసీపీ సీనియర్ నేత, టీటీడీ మాజీ చైర్మన్ భూ మన కరుణాకర్ రెడ్డి చుట్టూ తిరుగుతున్న రాజకీయ పరిణా మాలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. తనపై ఉన్న 'హిం దూ వ్యతిరేకి' ముద్రను చెరిపేసుకునేందుకు భూమన వేస్తున్న అ డుగులు, తాజాగా జరిగిన ఒక ముస్లిం దంపతుల మత మార్పిడి ఉదంతం రాజకీయ వర్గాల్లో వేడి పుట్టిస్తోంది. తిరుపతికి చెందిన యాలమూరి శ్రీనివాస్‌రెడ్డి, పుష్ప దంపతులు ఉపాధి కోసం సు మారు 27 ఏళ్ల క్రితం సౌదీ అరేబియా వెళ్లారు. అక్కడ ఉన్న కా లంలో వారు ఇస్లాం మతాన్ని స్వీకరించి, తమ పేర్లను అబ్దుల్లా, అమీనాగా మార్చుకున్నారు. అన్ని అధికారిక పత్రాల్లోనూ అవే పేర్లతో కొనసాగారు. 2015లో భారతదేశానికి తిరిగి వచ్చిన వీ రు తిరుపతిలోని పెద్దకాపు వీధిలో నివాసం ఉంటున్నారు.ఈ వి షయం తెలుసుకున్న భూమన కరుణాకర్ రెడ్డి, స్వయంగా వారి ఇంటికి వెళ్లి పలుమార్లు చర్చలు జరిపారు. హిందూ ధర్మం విశి ష్టతను వారికి వివరించి, తిరిగి స్వధర్మానికి రావాలని ప్రేరేపిం చారు. ఫలితంగా, భూమన నివాసంలో వేద పండితుల మంత్రో చ్ఛారణల మధ్య ఆ దంపతులు తిరిగి హిందూ మతాన్ని స్వీకరిం చారు. అబ్దుల్లా మళ్ళీ శ్రీనివాస్‌రెడ్డిగా, అమీనా పుష్పగా తమ మూలాల్లోకి వచ్చారు.వైఎస్ కుటుంబానికి అత్యంత సన్నిహితు డైన భూమనపై ప్రత్యర్థులు మొదటి నుంచీ ఒకే రకమైన దాడి చేస్తున్నారు. ఆయన నాస్తికుడని, దేవుడిని నమ్మరని, లోలోపల క్రైస్తవ మతాన్ని ప్రోత్సహిస్తారని రాజకీయ విమర్శలు నిత్యం విని పిస్తుంటాయి. ముఖ్యంగా టీటీడీ చైర్మన్‌గా ఉన్న సమయంలోనూ ఆయనపై అనేక ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో, ఒక ముస్లిం జంటను హిందూ మతంలోకి తీసుకురావడం ద్వారా తనపై ఉన్న వ్యతిరేక ప్రచారానికి భూమన గట్టి కౌంటర్ ఇచ్చే ప్రయత్నం చేశారని విశ్లేషకులు భావిస్తున్నారు.భూమన కరుణాకర్ రెడ్డి టీటీడీ చైర్మన్‌గా ఉన్న సమయంలో ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. తిరుమల ఆస్థాన మండపంలో 90 మంది పీఠాధిపతులు, మఠాధిపతుల తో నిర్వహించిన వేద విద్వత్ సదస్సులో ఒక తీర్మానం చేశారు. ఇతర మతాల నుంచి హిందూ మతంలోకి రావాలనుకునే వారికి తిరుమల శ్రీవారి సన్నిధినే వేదికగా చేయాలని, శ్రీవారే వారికి దిక్సూచి కావాలని ఆయన సంకల్పించారు. అయితే, ఈ లోపే ప్రభుత్వం మారిపోవడం, తదుపరి వచ్చిన కూటమి ప్రభుత్వం దీనిపై పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో ఆ ప్రక్రియ ఆగిపో యింది. ఇప్పుడు వ్యక్తిగత స్థాయిలో ఆయన ఈ కార్యక్రమాలు చేపడుతున్నారు.ప్రస్తుతం తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యి కల్తీ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ వివాదం లో అప్పటి టీటీడీ బోర్డు పైనా, వైసీపీ ప్రభుత్వం పైనా హిందూ సమాజంలో తీవ్ర ఆగ్ర హం వ్యక్తమవుతోంది. సరిగ్గా ఇలాంటి క్లిష్ట సమయంలో భూమ న ఇలాంటి మత పునఃస్వీకరణ కార్యక్రమాలు చేపట్టడం వెనుక రాజకీయ ప్రయోజనాలున్నా యని రాజకీయ పండితులు అభిప్రా యపడుతున్నారు.వైసీపీపై పడిన 'హిందూ వ్యతిరేక' ముద్రను తొలగించుకోవడానికి భూమ న కరుణాకర్ రెడ్డి చేస్తున్న ఈ ప్రయత్నాలు క్షేత్రస్థాయిలో ఎంత వరకు ప్రభావం చూపుతాయ న్నది ప్రశ్నార్థకమే. మత మార్పిడి చేసుకున్న దంపతులు భూమ న కృషిని కొనియాడుతున్న ప్పటికీ.. సాధారణ భక్తులు, రాజకీయ ప్రత్యర్థులు దీనిని కేవలం డ్యామేజ్ కంట్రోల్ చర్యగానే చూస్తున్నారు.

# అమరావతిలో లెక్క తప్పిన వైసీపీ




**విజయవాడ–సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుపై వారం రోజులుగా చర్చలు జరుగుతున్నాయి. దీనిపై కూటమి పార్టీలు చాలా దూకుడుగా రాజకీయంగా ఎత్తులు వేస్తూ గేమ్‌లో పైచేయి సాధించాయి. కానీ ఈ విషయంలో వైసీపీ మాత్రం మరోసారి సెల్ఫ్‌గోల్స్‌తో మరోసారి అబాసుపాలైంది. అమరావతి అనే ఎమోషన్‌ను క్యారీ చేయడంలో కూటమి పార్టీలు ముఖ్యంగా టీడీపీ విజయవంతం అయిందని చెప్పవచ్చు. ఈ విషయంలో విధానం అంటూ లేకుండా వైసీపీ తీవ్రంగా విమర్శలు పాలైంది. ఈ బిల్లు పార్లమెంట్‌లో చర్చకు వచ్చే సందర్భంలో కూడా తన వాదనను బలంగా చెప్ప లేకపోయింది. అన్ని పార్టీలు ముక్తకంఠంతో అమరావతికి జై కొడితే ఒక్క వైసీపీ మాత్రమే తన స్టాండ్ ఏంటో చెప్పలేక చతికిలపడింది. అమరావతి చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో చర్చ జరుగుతున్న టైంలో శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేదీ మాట్లాడుతూ, టీడీపీ లీడర్లంతా గ్యాలరీల్లో ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. మంత్రి నారా లోకేష్‌తోపాటు లోక్‌సభ ఎంపీలంతా కూడా అక్కడ కూర్చొని చర్చ జరుగుతున్న తీరును పరిశీలించారు. ఇది చూడటానికి సాధారణ విషయమే కావచ్చు కానీ, ప్రియాంక చతుర్వేదీ మాట్లాడుతూ అమరావతిపై వారికి ఉన్న ఎమోషన్ ఎలాంటిదో అంటూ కితాబు ఇచ్చారు. దీని అక్కడ ఉన్న వారంతా చప్పట్లు కొడుతూ స్వాగతించారు. బిల్లు ఆమోదం పొందిన తర్వాత అందరూ లేచి సభకు నమస్కరించారు. హర్షధ్వానాలు చేశారు. అక్కడి వారంతా జై అమరావతి అంటూ నినాదాలు చేశారు. ఈ మొత్తం ఎపిసోడ్‌లో అమరావతి అనే ఎమోషన్‌ను పార్లమెంట్‌లో క్యారీ చేయడంలో కూటమి పార్టీలు, ముఖ్యంగా టీడీపీ విజయవంతం అయ్యింది. అందుకే అన్ని పార్టీలు బిల్లుకు మద్దతు ఇచ్చారు. ఎన్డీఏ, ఇండి కూటమి పార్టీలు అన్నీ జై అమరావతి అని నినదించాయి. ఇంతటి కీలకమైన ఘట్టంలో వైసీపీ పాత్ర లేకుండా పోయింది. దీనికి ఆ పార్టీ కన్ఫ్యూజన్ స్టాండే కారణం. సందర్భానుసారం స్టాండ్ మారుస్తూ అటు పార్టీ క్యాడర్‌ను, ఇటు ప్రజలను డైలమాలో పడేసింది. అసలు అమరావతిని వ్యతిరేకిస్తున్నారో చెప్పలేదు. సమర్థిన్నారో చెప్పడం లేదు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఎత్తున్న మూడు రాజధానులకు కట్టుబడి ఉన్నామనే విషయంపై కూడా క్లారిటీ ఇవ్వలేదు. ఇప్పుడు కొత్తగా మావిగన్ అంటూ సరికొత్త పల్లవి అందుకుంది. రోజుల వ్యవధిలోనే రకరకాల రంగులు మార్చి అటు సభల్లో ఇటు ప్రజల్లో చులకనైంది. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ప్లేట్ ఫిరాయించింది. మూడు రాజధానులు అంటూ సరికొత్త మ్యూజిక్ స్టార్ట్ చేసింది. అంతే రాజధాని ప్రాంత రైతులంతా రోడ్లపైకి వచ్చారు. అధికారంలో ఉన్న వైసీపీ నాడు వారికి పోటీగా మూడు రాజధానులు కావాలనే వాదనలో అమరావతిలోనే ప్రత్యేక ధర్నా శిబిరాన్ని ఏర్పాటు చేసింది. కనీసం అక్కడి రైతులతో మాట్లాడి వారి సమస్యలేంటీ, మూడు రాజధానుల విధానం ఎందుకు ఎంచుకున్నామో అనే విషయాన్ని వివరించే ప్రయత్నం చేయలేదు. ఉక్కుపాదం మోపి ఉద్యాన్ని అణచివేయాలని చూశారు. వారిపై తీవ్రమైన విమర్శలు చేశారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారు. వైజాగ్‌లో రుషి కొండను బద్దలు కొట్టి కట్టుకున్న ప్యాలెస్ కూడా నెగెటివ్ భావన వచ్చింది. 2024 ఎన్నికల్లో మూడు రాజధానులను ప్రజలు తిరస్కరించారనే విషయాన్ని కూడా వైసీపీ అంగీకరించడం లేదు. అలాగనే మూడు రాజధానులకు ఇప్పటికీ కట్టుబడే ఉన్నామని చెప్పడానికి కూడా ముందుకు రావడం లేదు. ఎన్నికల వరకు మూడు రాజధానులు అంటూ ప్రచారం చేసిన ఆ పార్టీ తర్వాత సైలెంట్ అయిపోయింది. అమరావతిలో అభివృద్ధి జరగడం లేదని సన్నాయి నొక్కులు నొక్కడం మొదలు పెట్టింది. ఇప్పుడు తేల్చుకోవాల్సిన వచ్చిన సందర్భంలో కూడా అసెంబ్లీకి వెళ్లకుండా, పార్లమెంట్‌లో వాదన గట్టిగా వినిపించకుండా తేలిపోయింది. అమరావతికి అనుకూలంగా ఉన్నామంటూనే బిల్లును వ్యతిరే కిస్తున్నామని అటూఇటూ కాని స్టేట్మెంట్‌తో అబాసుపాలైంది. లోక్‌సభలో, రాజ్యసభలో రెండింటిలో అన్ని పార్టీలు అమరావతి వర్ధిల్లాలంటూ దీవిస్తుంటే వైసీపీ మాత్రం శాపనార్థాలు పెట్టి బయటకు వచ్చేసింది. అన్నింటికి తోడు జగన్ చేసిన మావిగన్ కూడా తీవ్ర విమర్శలకు ట్రోలింగ్‌కు గురైంది. చంద్రబాబు విమర్శించినట్టు అమరావతి అనడం కూడా జగన్‌కు ఇష్టం లేదని అందుకే పూటకో నినాదం చేస్తున్నారని అన్నట్టుగానే వారి తీరు ఉంది. ఇలా అడుగడుగునా తప్పుల మీద తప్పులు చేస్తూ అమరావతి ప్రాంతానికే కాకుండా ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలకు వైసీపీ దూరంగా జరిగిపోయింది. అందుకు భిన్నంగా టీడీపీ. అమరావతి రాగం ఎత్తుకున్నప్పటి నుంచి వారి పార్టీ లీడర్లంతా ఒకటే మాటపై ఉన్నారు. జగన్ మూడు రాజధానుల ఎత్తుగడను కూడా లెక్క చేయకుండా అన్ని ప్రాంతాల్లో ఒకే నినాదం ఉండేలా చూసుకున్నారు. ప్రభుత్వంపై నమ్మకంతో రాజధానికి పైస ఆశించకుండా రైతులు భూములు ఇచ్చిన విషయాన్ని ప్రపంచం దృష్టికి తీసుకెళ్లారు. తాత్కాలికంగా అని చెప్పి కొన్ని బిల్డింగ్స్ ఏర్పాటు చేశారు. దీనికి తోడు టీడీపీ నేతలు ఎవరూ ప్రాంతంలో ఇళ్లు నిర్మించుకోవడానికి ప్రయత్నించ లేదు. విజిటింగ్ లీడర్స్ అంటూ విమర్శలు ఎదురైనా వాటిని తట్టుకొని నిలబడ్డారు. అక్కడ వైజాగ్‌లో జగన్ తన కోసం ప్యాలెస్ రెడీ చేసుకోవడం, ఇక్కడ చంద్రబాబు తనకంటూ ఇంటిని నిర్మించుకోకపోవడం కూడా కలిసి వచ్చింది. సంక్షోభంలోనే అవకాశాలు వెతుక్కునే చంద్రబాబు అమరావతి రైతుల ఉద్యమం, నాటి ప్రభుత్వం వారిని చిత్రవధ చేసిన పరిణామాలను తనకు రాజధానికి అనుకూలంగా ప్రజలను ఏకం చేయడానికి చేసుకున్నారు.అమరావతి రైతులను టీడీపీ వదిలేస్తుందని ప్రచారం చేసిన వైసీపీ అక్కడి రైతులను పట్టించుకోకుండా తప్పుల మీద తప్పులు చేసింది. రైతులను పట్టించుకోదని విమర్శలు ఎదుర్కొన్న టీడీపీ మాత్రం వారిని నమ్ముకొని, ఉద్యమాలు చేసి సెంటిమెంట్‌ను రాజేసి రాష్ట్ర ప్రజలందరితో జై అమరావతి అనేలా చేసింది. రాష్ట్ర ప్రజలతోనే యావత్ దేశ ప్రజలతో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మాత్రమే అని నినదించేలా చేసింది. అమరావతి నినాదాన్ని పట్టుకొని టీడీపీ వంద మెట్లు పైకి ఎగబాగితే, పూటకో నినాదంతో వైసీపీ మరింత కిందికి జారిపోయింది.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )